

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | బుధవారం 06 అక్టోబరు 2021 | సంపుటి : 03 | సంచిక : 56 | పేజీలు : 4 | వెల : రూ 3-00


## అవిశ్వాసంలో ఓడిపోయిన మేయర్ పావని



కాకినాడ: కాకినాడ మేయర్‌పై టీడీపీ అసమ్మతి కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసంలో మేయర్ పావని, ఉపమేయర్-1 సత్తిబాబు ఓడిపోయారు. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 33 మంది కార్పొరేటర్లు, ముగ్గురు ఎక్స్‌అఫీసియో సభ్యులతో కలిపి మొత్తం 36 ఓట్లు వచ్చాయి. కాకినాడ మున్సిపల్ కౌన్సిల్‌లో 44 మంది కార్పొరేటర్లు ఉండగా, మరో ముగ్గురు ఎక్స్ అఫిషియో సభ్యులున్నారు. అవిశ్వాస తీర్మానానికి కోరం 31 మంది ఉండాల్సి నేపథ్యంలో సమావేశానికి 43 మంది కార్పొరేటర్లు, 3 ఎక్స్‌అఫిషియో సభ్యులు హాజరయ్యారు. ఎక్స్ అఫిషియో సభ్యులుగా మంత్రి కురసాల కన్నబాబు, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీ వంగా గీత ఓటువేశారు. అయితే కోర్టు కేసు నేపథ్యంలో ఫలితాలను ప్రిసైడింగ్ అధికారి రిజర్వ్ చేశారు. కోర్టు తీర్పు తర్వాత ఫలితాలనుఅధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

## 'స్వేచ్ఛ' కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం జగన్



తాడేపల్లి: మహిళలు, కిశోర బాలికల ఆరోగ్యం, పరిశుభ్రతే ధ్యేయంగా రూపొందించిన 'స్వేచ్ఛ' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ.. మహిళలు, బాలికలు ఆరోగ్యం, పరిశుభ్రతే 'స్వేచ్ఛ' కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. రుతుక్రమ సమస్యలతో చదువులు ఆగిపోతున్నాయని, 7 నుంచి 12వ తరగతి విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్లు అందజేస్తామని తెలిపారు. 10లక్షల మంది కిశోర బాలికలకు ఉచితంగా న్యాపికిన్లు పంపిణీ చేస్తామని సీఎం జగన్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 10, 388 స్కూళ్లు, కాలేజీల్లో శానిటరీ న్యాప్‌కిన్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రతి నెల జేసీ (ఆసరా) ఆధ్వర్యంలో పర్యవేక్షణ జరగాలని పేర్కొన్నారు. మహిళా టీచర్లు, ఏఎన్ఎంలు బాలికలకు అవగాహన కల్పించాలని, 'స్వేచ్ఛ' పథకం అమలుపై నోడల్ అధికారిగా మహిళా టీచర్‌ను నియమించామని తెలిపారు. దిశ యాప్, దిశ చట్టం గురించి వివరించాలని అన్నారు. మహిళా సాధికారతలో ఏపీ మొదటి స్థానంలో ఉందని సీఎం జగన్ తెలిపారు. వైఎస్సార్ చేయూత స్టోర్లలో శానిటరీ న్యాప్‌కిన్లు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. చరిత్రను మార్చే శక్తి మహిళలకే ఉందని గట్టిగా నమ్మిన ప్రభుత్వం తమదని సీఎం జగన్ తెలిపారు. విద్యార్థినుల ఆరోగ్య సంరక్షణ, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు చదువులకు దూరం కాకుండా చూడటమే లక్ష్యంగా స్వేచ్ఛ కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు వైఎస్సార్ చేయూత స్టోర్లలో నాణ్యమైన న్యాప్‌కిన్స్ తక్కువ ధరకు విక్రయించేలా చర్యలు చేపట్టింది.యూనిసెఫ్, వాష్, పీ అండ్ జీ తదితర సంస్థలతో కలసి అవగాహన తరగతులు నిర్వహించి రుతుక్రమంపై అపోహలు తొలగించనున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది మార్చి 8న స్వేచ్ఛ కార్యక్రమాన్ని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలను మహిళా, శిశు సంక్షేమశాఖ పరిధిలోకి తెచ్చింది. ప్రతి రెండు నెలలకు ఒకసారి స్కూళ్లు, కాలేజీలలో న్యాప్‌కిన్స్ పంపిణీకి చర్యలు చేపట్టింది.

## అక్టోబర్ 7న ఒంగోలుకు సీఎం జగన్



ఒంగోలు: వైఎస్సార్ ఆసరా రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఈనెల 7వ తేదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒంగోలు రానున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక శాఖామంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, సీఎం కార్యక్రమ సమన్వయకర్త తలశిల రఘురాం పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి పర్యటన ఖరారు కావడంతో ముందుగా పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలోని క్రీడా మైదానాన్ని మంత్రి బాలినేని, తలశిల రఘురాం, సీఎం సెక్యూరిటీ ఆఫీసర్ వకుల్ జిందాల్, కలెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్పీ మలికాగర్గ్ సోమవారం పరిశీలించారు. అనంతరం క్రీడా మైదానంలో సీఎం కార్యక్రమ ఏర్పాట్లకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో వారు చర్చించారు. క్రీడా మైదానంలో దక్షిణ భాగంలో ముఖ్యమంత్రి సభావేదిక ఉండాలన్నారు. 23 నెలల తరువాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాకు వస్తుండడంతో కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా భావించాలన్నారు.మహిళల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేస్తున్న కార్యక్రమంలో ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్, ఎస్పీ ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని విజయవంతం చేయాలన్నారు. ఉదయం 9 గంటలకు మహిళలు పీవీఆర్ ఉన్నత పాఠశాలలో ఉండేలా చూడాలన్నారు. కోవిడ్ నిబంధనలు అనుసరించి 20 వేల మంది కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒంగోలు పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో హెలిపాడ్ ఏర్పాట్లు, వేదిక వద్దకు సీఎం వచ్చే రూటుకు ఆర్‌అండ్‌బీ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలు మార్గానికి అడ్డు రాకుండా సీఎంకు అభివాదం చేసేందుకు వీలుగా బ్యారికేడ్ల ఏర్పాటుకు సంబంధించి పలు సూచనలు చేశారు. హెలిపాడ్ నుంచి సభా ప్రాంగణానికి వచ్చే ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా రెండో విడతలో మహిళలకు నగదు పంపిణీ కార్యక్రమం ఒంగోలులో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సీఎం జిల్లాకు వచ్చి దాదాపు రెండేళ్లవుతున్నందున విజయవంతం చేసే బాధ్యత మహిళలపై ఉందన్నారు. కేవలం రెండు రోజుల సమయంలో సభా ఏర్పాట్ల విషయంపై కొందరు అనుమానం వ్యక్తం చేయగా 'ఒంగోలులో వాసన్న ఉన్నాడు కదా చూసుకుంటాడు' అని



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నట్లు తలశిల తెలిపారు.కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రవీణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. కోవిడ్ రెండు టీకాలు వేయించుకున్న వారినే కార్యక్రమానికి అనుమతిస్తామన్నారు. ప్రాంగణంలో స్టాల్స్ ఏర్పాటు చేయాలని, నగరంలో విద్యుత్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పర్యవేక్షణ కోసం ప్రత్యేక కమిటీలు నియమించాలని, కార్యక్రమానికి ఎలాంటి అవాంతరాలు ఎదురుకాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రికి వివరించారు. అన్ని గ్రామ, వార్డు సచివాలయాలతోపాటు రైతు భరోసా కేంద్రాల్లోను సీఎం కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈవో ఎండీ ఇంతియాజ్, ఎస్పీ మలికాగర్గ్, జేసీలు జేవీ మురళి, కె.కృష్ణవేణి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, డీఆర్వో ఎస్.సరళావందనం, లిడ్ క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ బాబూరావు, మెప్మా పీడీ టి.రవికుమార్, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.సీఎం పర్యటన షెడ్యూల్‌ను కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మీడియాకు విడుదల చేశారు. ఉదయం 9.55 గంటలకు తాడేపల్లిలోని ఆయన నివాసం వద్ద నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరతారు. 10.35 గంటలకు ఒంగోలు పోలీసు ట్రైనింగ్ కాలేజీలో హెలికాప్టర్ దిగుతారు. 10.45 గంటలకు హెలిపాడ్ నుంచి బయల్దేరి 11 గంటలకు సభాస్థలి అయిన ఒంగోలు పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలకు చేరుకుంటారు. పది నిముషాలపాటు స్టాల్స్‌ను పరిశీలిస్తారు. 11.15 గంటలకు జ్యోతి ప్రజ్వలన, డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పిస్తారు. 11.25 గంటలకు మంత్రుల ప్రసంగాలు, 11.40 నుంచి 12 గంటల వరకు లబ్ధిదారులతో సీఎం ముఖాముఖి కార్యక్రమం, అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం ఉంటుంది. 12.30 గంటలకు వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రారంభిస్తారు. 12.40 గంటలకు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఓట్ ఆఫ్ థ్యాంక్స్‌తో కార్యక్రమం ముగుస్తుంది. 12.45 గంటలకు సభాస్థలి వద్ద నుంచి కారులో హెలిపాడ్‌కు మధ్యాహ్నం ఒంటి గంటకు చేరుకుంటారు.

## బద్వేలు ఉపఎన్నికలో కాంగ్రెస్ పోటీ: శైలజనాథ్




గుంటూరు: బద్వేలు ఉప ఎన్నికలో కాంగ్రెస్ పోటీ చేస్తుందని ఏపీ పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజనాథ్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ఏపీలో ప్రజాస్వామ్యాన్ని కాపాడానికి.. ప్రజలోకి వెళుతున్నామన్నారు. స్థానిక ఎన్నికల్లో కడప జిల్లాలో ఎన్ని దారుణాలు జరిగాయో చూశామన్నారు. దౌర్జన్యాలకు, దాడులకు కాంగ్రెస్ పార్టీ భయపడదన్నారు. రాష్టంలో పరిపాలన రోజు రోజుకీ దారుణంగా మారుతోందని, అప్పుల బాధతో ప్రభుత్వం తలమునకలు అవుతోందన్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా మాదకద్రవ్యాలు దొరుకుతున్నాయన్నారు. బీజేపీని ప్రశ్నించలేని అసమర్థతలో ఏపీ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. అన్యాయాన్ని ప్రశ్నించడానికి బద్వేలులో కాంగ్రెస్ పోటీ చేస్తుందన్నారు. విశాఖ ఉక్కు, ప్రభుత్వ ఆస్తులు ప్రవేటీకరణ ఆపాలంటే.. అది కాంగ్రెస్‌తోనే సాధ్యమని శైలజనాథ్ అన్నారు.

## ఉపాధి హామీ పథకం బిల్లుల చెల్లింపులో ఏపీ హైకోర్టు సంచలన తీర్పు




అమరావతి: ఉపాధి హామీ పథకం బిల్లుల చెల్లింపులకు సంబంధించి ఏపీ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. ఈ అంశంపై మంగళవారం విచారణ జరిపిన న్యాయస్థానం.. 1013 పిటిషన్ల బిల్లుల చెల్లింపుల్లో తీర్పు వెల్లడించింది. నాలుగు వారాల్లోగా బిల్లులు మొత్తం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 20 శాతం బిల్లులు తగ్గించి ఇవ్వాలని ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను హైకోర్టు కొట్టేసింది. బకాయిలను 12 శాతం వడ్డీతో వెంటనే చెల్లించాలని ఆదేశించింది. నాలుగు వారాల్లోగా బిల్లులు చెల్లించాలని, ఇప్పటికే కొంత చెల్లిస్తే మిగితాది కూడా 12 శాతం వడ్డీతో చెల్లించాల్సిందేనని హైకోర్టు తుది తీర్పు ఇచ్చింది.

## కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోతే ఏం చేయాలి?: ఎంపీ రఘురామ



ఢిల్లీ: వెనకబడిన కులాలకు కేంద్రం 10శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోందని ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. ఏపీలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలు ఆలస్యంగా చేపట్టారని చెప్పారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలో చంద్రబాబు కాపులకు 5శాతం కల్పించారని పేర్కొన్నారు. ఉన్నత కులాల్లో సగం మంది కాపులు, బలిజ, తెలగ వారే ఉన్నారని ఆయన చెప్పారు. ఈడబ్ల్యూఎస్ 10శాతం రిజర్వేషన్లలో కాపు, బలిజ, తెలగలకు 5 శాతం, మిగిలినది కమ్మ, రెడ్ల సహా ఉన్నత కులాల్లోని వెనకబడిన వారికి వర్తింపజేయాలన్నారు. ఎవరికి ఇబ్బంది లేకుండా ఉండే ఈ ప్రతిపాదనను అమలు చేయాలని ఆయన సూచించారు. కరెంట్ బిల్లులు కట్టకపోతే ఫైన్‌లు వేస్తారు.. ఫ్యూజులు తీస్తారని మండిపడ్డారు. మరీ పనులు చేసిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోతే ఏం చేయాలి? అని ఆయన ప్రశ్నించారు. మద్యం సహా ప్రజల బలహీనతలతో ప్రభుత్వ పెద్దలు దోచుకుంటున్నారని ఆరోపించారు. జగన్ బెయిల్ రద్దుపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశానన్నారు. ధర్మం, న్యాయం కోసం చివరివరకు పోరాడతానని స్పష్టం చేశారు.

## అధికార పార్టీ పెద్దల సేవలో డీజీపీ: ధూళిపాళ్ల

మంగళగిరి: ఏపీలో డ్రగ్స్ వినియోగాన్ని సీఎం పరోక్షంగా అంగీకరిస్తున్నారని తెదేపా సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్ర అన్నారు. డ్రగ్స్‌ను సీఎం చిన్న విషయంగా చెబుతున్నారని మండిపడ్డారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "ఇటీవల



దేశంలోనే అతి పెద్ద డ్రగ్స్ రవాణా బయటపడింది. డ్రగ్స్ ఆరోపణలపై పోలీసులు విచారణ జరపాలి. డీజీపీ తన బాధ్యతలను గాలికి వదిలేశారు. అధికార పార్టీ పెద్దల సేవలో డీజీపీ తరిస్తున్నారు. దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా మూలాలు రాష్ట్రంలోనే ఉంటున్నాయి. వైకాపా అధికారంలోకి వచ్చాక గంజాయి సాగు విపరీతంగా పెరిగింది. దాదాపు 15 వేల ఎకరాల్లో గంజాయి సాగవుతోంది. వైకాపా నేతల కనుసన్నల్లోనే గంజాయి సాగు, రవాణా జరుగుతోంది. కాకినాడ తీరంలో ఇటీవల ఓ ఓడ తగలబడిపోయింది. ఓడ తగలబడిన విషయంలో పోలీసులు వాస్తవాలను దాస్తున్నారు. గోదాముల్లో గంజాయి నిల్వ చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. కావాలనే ఎక్సైజ్ శాఖను నిర్వీర్యం చేసి ఎస్ఈబీ తీసుకొచ్చారు" అని ధూళిపాళ్ల ఆరోపించారు.

## ఏపీలో కొత్తగా 671 కరోనా కేసులు



అమరావతి : ఏపీలో గడిచిన 24గంటల్లో కొత్తగా 671 కరోనా కేసులు నమోదయ్యాయి. తాజా కేసులతో రాష్ట్రంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 20,30,503కు పెరిగింది. తాజాగా 1,272 మంది బాధితులు డిశ్చార్జి అయ్యారు. ఇప్పటి వరకు 20,53,863 మంది కోలుకున్నారు. వైరస్ బారినపడి 11 మంది ప్రాణాలు కోల్పోగా.. మృతుల సంఖ్య 14,219కు పెరిగింది. ప్రస్తుతం రాష్ట్రంలో 9141 యాక్టివ్ కేసులున్నాయి. తాజా కేసుల్లో అత్యధికంగా పశ్చిమ గోదావరిలో 671, చిత్తూరులో 102 కేసులు పాజిటివ్ కేసులు రికార్డయ్యాయి. కొవిడ్‌తో కృష్ణా జిల్లాలో ఇద్దరు, ప్రకాశంలో ఇద్దరు, పశ్చిమ గోదావరిలో ఇద్దరు, వైఎస్సార్ కడప, నెల్లూరు, శ్రీకాకుళం, విజయనగరం, గుంటూరు జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మృతి చెందారు.

## ఏపీ సచివాలయ వ్యవస్థ సరికొత్త రికార్డు

### గ్రామ వార్డు సచివాలయ శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్

విజయవాడ: ప్రజాపాలనలో ఆంధ్రప్రదేశ్ సచివాలయ వ్యవస్థ సరికొత్త రికార్డు సృష్టించిందని గ్రామ వార్డు సచివాలయ శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ తెలిపారు. ఆయన మంగళవారం మీడియాతో మట్లాడుతూ.. రాష్ట్రంలో 3.2 కోట్ల మందికి సేవలు అందించిన సచివాలయాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు కొత్త నిర్వచనంగా నిలిచాయని తెలిపారు. రాష్ట్రంలో రెండేళ్లలోనే 15,004 సచివాలయల ద్వారా 543సేవలు, 34సంక్షేమ పథకాల అమలవుతున్నాయని పేర్కొన్నారు. సచివాలయాలు పని తీరును ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్నాయని తెలిపారు. 99శాతం సేవలను సీఎం వైఎస్ జగన్ చెప్పిన సమయంలోనే అందిస్తున్నామని అన్నారు. త్వరలో సచివాలయంలో 150 కేంద్ర ప్రభుత్వ సేవలను కూడా



అందుబాటులోకి తెస్తున్నామని అన్నారు. 500 సచివాలయాల్లో ఆధార్ సేవలు ప్రారంభించామని తెలిపారు. రిజిస్ట్రేషన్లు కూడా సచివాలయంలో ప్రారంభిస్తామని తెలిపారు. తమిళనాడు, కర్ణాటక, పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాలు ఈ వ్యవస్థను పరిశీలించాయని అజయ్ జైన్ తెలిపారు.

# సంపాదకీయం

బుధవారం 06 అక్టోబరు 2021

## పార్టీలు ఏవైనా.. జెండా.. అజెండా ఒక్కటే

ప్రజల ఆస్తులను మోనిటైజేషన్ పేరుతో ప్రైవేటీకరణకు దారులు వేస్తున్నది. మోనిటైజేషన్ అంటే ప్రైవేటీకరణ లేదా నిర్వహణకు ప్రైవేటు వారికి అప్పగించటం. పేరు ఏది పెట్టినా మన పాలకులు వారి అనాలోచిత పనులవల్ల, ప్రణాళికల వల్ల, పథకాల వల్ల ప్రజా ప్రయోజనం కోసం ఉపయోగపడే ప్రజా ఆస్తులను పాలకులు తమ సొంత ఆస్తులుగా భావించి ప్రజా భవిష్య ప్రయోజనం మరిచి ఆస్తులను మోనిటైజేషన్ పేరుతో ప్రైవేట్ వారికి ఇవ్వడానికి సిద్ధపడటం ప్రత్యేకంగా ప్రభుత్వమే తమ అసమర్థతను ఒప్పుకొని దేశంలో ప్రైవేటీకరణకు మార్గాలు వేయడం ప్రజలకు నష్టమే జరుగుతుందని నిపుణుల అభిప్రాయం.అది పూర్తిగా కట్టబెట్టటం కాదు, నిర్వహణ ప్రభుత్వానికి కొంత ముట్టచెప్పటం అని చెబుతున్నారు. దానికే మోనిటైజేషన్ అని పేరు పెట్టారు. ప్రైవేటురంగం గురించి దేశ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం భ్రమలు కల్పిస్తుంది. ప్రైవేటు రంగం ఎంత అవినీతి, అక్రమాలతో జనాలను పీక్కు తింటుందో, ఎంత అమానవీయంగా ప్రవర్తిస్తుందో కరోనా మహమ్మారి వెల్లడించింది. జెట్ ఎయిర్ వేస్, కింగ్ ఫిషర్ ఎయిర్ లైన్స్, ఎస్ బ్యాంకు, ఐఎల్ అండ్ ఎఫ్ఎస్, రిలయన్స్ కమ్యూనికేషన్స్, టాటా టెలి సర్వీసెస్, ఒడా ఫోన్, సత్యం కంప్యూటర్స్ ఇలా అనేక కంపెనీలు ఎలా మోసాలకు పాల్పడ్డాయో తెలిసిందే. ఇలాంటి వారికి ప్రభుత్వ ఆస్తులను అప్పగిస్తే వారు బాగు చేస్తారన్న హామీ ఏమిటి? రిలయన్స్ కమ్యూనికేషన్స్ ఘోర వైఫల్యం గురించి తెలిసిందే. మన కళ్ల ముందు దివాలా తీసిన అతిపెద్ద ప్రైవేటు కంపెనీ. వారి సామర్థ్యం ఏమైంది? రూ. పద్దెనిమిది వేల కోట్ల ఆస్తులున్న సదరు కంపెనీ 50 వేల కోట్ల అప్పులతో ఐపి (దివాలా పిటీషన్) పెట్టింది. దానికే రాఫెల్ విమానాల కాంట్రాక్టును కట్టబెట్టారు. పెద్ద కంపెనీగా పేరు గాంచిన టాటా గ్రూపుకు చెందిన టాటా సన్స్ లిమిటెడ్ కంపెనీ వివాదం గురించి తెలిసిందే. ఇక ప్రైవేటు బ్యాంకులు తీరుతెన్నులను చూద్దాం. గతంలో ప్రైవేటు రంగంలోని బ్యాంకులు, బీమా కంపెనీలు జనానికి టోపీ పెట్టాయి. అప్పుడే మరిచిపోతే ఎలా? ఇప్పుడు జాతీయ సంపదలుగా ఉన్న వాటిని తిరిగి ప్రైవేటు రంగానికి కట్టబెట్టబోతున్నారు. 1947 నుంచి 1969 వరకు 559 ప్రైవేటు బ్యాంకులు దివాలా తీశాయి. ఈ కాలంలో 736 బ్యాంకులు విలీనం లేదా రద్దు చేశారు. ఇప్పుడు ప్రభుత్వ బ్యాంకులను తిరిగి ప్రైవేటీకరించాలని కోరుతున్నారు. వాటిని ప్రైవేటు వారు నష్టల్లోకి నెట్టితే ప్రజల సొమ్ముకు ఎవరు బాధ్యత తీసుకుంటారు. 1969 బ్యాంకుల జాతీయకరణ తరువాత కూడా కొన్ని ప్రైవేటు బ్యాంకులను అనుమతించారు.వాటిలో ఇప్పటి వరకు 36 బ్యాంకులు అక్రమాలకు పాల్పడ్డాయి. అవేవీ ఇప్పుడు ఉనికిలో లేవు. గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకు వాటిలో ఒకటి. దానిని ఓరియంటల్ బ్యాంకుతో విలీనం చేశారు. ప్రైవేటు యాజమాన్యాల అంత సమర్థవంతమైనవి అయితే ఈ పరిస్థితి ఎందుకు తలెత్తింది. ఇప్పుడున్న ప్రైవేటు బ్యాంకులు తమ వాటాను ఎందుకు పెంచుకోలేకపోతున్నాయి. 2000 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు అమెరికాలో 563 ప్రైవేటు బ్యాంకులు విఫలమయ్యాయి. అక్కడ మొత్తం ప్రైవేటు రంగానిదే ఆధిపత్యం కదా! అందువలన అలాంటి పనులు చేయబోయే ముందు పోటీతత్వం ఉందా లేదో, వినియోగదారులను అధిక ధరలతో పిండకుండా చూసేందుకు ప్రభుత్వం బహిరంగ సమీక్షలు జరపాలని ఆస్ట్రేలియా పోటీతత్వ నిఘా సంస్థ అధ్యక్షుడు రోడ్ సిమ్స్ చెప్పారు. మరి తామే అసలైన జవాబుదారులం, చౌకీదారులం అని చెబుతున్న నేటి పాలకులు అలాంటి చర్చ ఎన్నడైనా, ఎక్కడైనా జరిపారా ఆస్ట్రేలియాలో తరచుగా పోటీ లేకుండా ప్రైవేటు వారికి అప్పగిస్తున్నారని సిమ్స్ వాపోయాడు. నియంత్రణలు లేకపోతే జనాన్ని పీక్కుతింటారని అన్నాడు. ఆస్తులను పాడి గేదెల మాదిరి మారిస్తే ఆర్థిక సామర్థ్యానికి ప్రతిబంధకం అవుతుందన్నాడు. సింగపూర్‌లో రైల్వేలను కొంత మేరకు ప్రైవేటీకరించారు. తీసుకున్న యజమాని తగినంత పెట్టుబడి పెట్టని కారణంగా రైళ్లు ఆగిపోతున్నాయి. అందువలన తిరిగి జాతీయం చేయాలనే ప్రతిపాదన ముందుకు వచ్చింది.పలు కంపెనీలు టెలికాం రంగంలోకి వచ్చినపుడు పోటీ పడి చార్జీలు తగ్గించిన విషయం తెలిసిందే. ఆలస్యంగా మార్కెట్లోకి వచ్చిన రిలయన్స్ జియో వినియోగదారులను అతి తక్కువ ఛార్జీలతో ఆకర్షించింది. తన ఆర్థిక శక్తిని పెట్టుబడిగా పెట్టింది. గణనీయమైన మార్కెట్‌ను ఆక్రమించింది. పోటీ కంపెనీలు దివాలా తీసిన తరువాత చార్జీలు పెంచుతున్న విషయం తెలిసిందే. ఇప్పుడున్న ఒకటి రెండు కంపెనీలు కూడా రంగం నుంచి తప్పుకుంటే ఆ కంపెనీ ఎంత చెబితే అంత చెల్లించక తప్పదు. రేపు రోడ్లయినా, విద్యుత్ మరొకటి ఏదైనా అంతే. మొత్తం ప్రైవేటు వారి నిర్వహణకుపోతే వారెంత చార్జీ చెల్లించాలంటే అంత చెల్లించాల్సిందే. ప్రజల ఆస్తులను ప్రైవేటు వారికి కట్టబెట్టటం మన దేశంలోనే కాదు. అనేక దేశాల పాలకులు సమర్పించుకుంటున్నారు. కేవలం కేంద్ర ప్రభుత్వాల దగ్గర ఉన్న వాటి విలువ కనిష్ఠంగా రూ. 75 లక్షల కోట్ల డాలర్లని నాలుగు సంవత్సరాల నాటి ఒక అంచనా. రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల వాటిని కూడా కలుపుకుంటే కొన్ని రెట్లు ఎక్కువ ఉంటుంది. ప్రభుత్వాల అప్పులు అనేక దేశాల్లో జిడిపికి వంద శాతం దాటినందున రాబోయే రోజుల్లో ఆర్థిక వృద్ధి, ఉపాధి కల్పనకు నిధుల కేటాయింపు మరింత ఇబ్బంది అవుతుందని, అవసరాలకు- కేటాయింపులకు మధ్య తేడా 2040 నాటికి 15 లక్షల కోట్ల డాలర్లు ఉంటుందని ఆర్థిక నిపుణుల అంచనా. మన దేశంలో కూడా అదే జరుగుతోంది.1998 నాటికి మన కేంద్ర ప్రభుత్వ రుణం దాదాపు రూ. పది లక్షల కోట్లు. అది 2014లో ప్రస్తుత పాలకుల అధికారంలో రూ. 53 లక్షల కోట్లకు పెరిగింది. 2021 మార్చి నాటికి ఆ మొత్తం రూ. 116 లక్షల కోట్లు. వర్తమాన ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి అది రూ. 132 లక్షల కోట్లు అవుతుందని అంచనా చెపుతున్నాయి. కేంద్రం, -రాష్ట్ర ప్రభుత్వాల రుణాల మొత్తం జిడిపిలో 2019- 20 నాటికి 70% అయితే, మరుసటి ఏడాదికి అది 90 శాతానికి చేరింది. వంద శాతం మార్కు దాటటానికి ఎంతో దూరంలో లేము. అందువలన పాలకులు తెగబడి ప్రభుత్వ ఆస్తులను అయినకాడికి తెగనమ్మి లేదా నిర్వహణకు ప్రైవేటు వారికి అప్పగించి సొమ్ము చేసుకొని లోటు పూడ్చుకొనేందుకు లేదా అప్పులు తీర్చేందుకు పూనుకున్నారు. ఇవన్నీ అయిపోయిన తరువాత జనం మీద మరిన్ని భారాలు మోపటమే తరువాయి భాగం అవుతుంది. నిరుపయోగంగా పడి ఉన్న ఆస్తులను ధనార్జన కోసం అని నమ్మబలుకుతున్నా ప్రభుత్వాలు మోనిటైజ్ అండ్ మోడర్నయిజ్ అనే ఇతివృత్తంతో బడ్జెట్‌ను రూపొందించామని, ప్రభుత్వం ఉన్నది పాలన చేయటానికి తప్ప వాణిజ్యం చేయటానికి కాదు అన్నారు. దేశ పాలకులు దేశానికి చెందిన 26,700 కిలోమీటర్ల జాతీయ రహదారులు / 400 రైల్వే స్టేషన్లు / 150 రైళ్లు, రైల్వే ట్రాక్ లు / 42,300 కిలోమీటర్ల విద్యుత్ ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌లు / 5,000 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల హైడ్రో, సోలార్, పవన విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు / 8,000 కిలోమీటర్ల సహజ వాయువు పైప్‌లైన్ లు / 4,000 కిలోమీటర్ల హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్ పైప్ లైన్ లు /2.86 లక్షల కిలోమీటర్ల భారత్ నెట్ ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్, బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్ టవర్లు/ 160 బొగ్గు గనులు /761 మైనింగ్ బ్లాకులు /25 విమానాశ్రయాలు/ తొమ్మిది ఓడ రేవుల్లో 31 ప్రాజెక్టులు/ రెండు జాతీయ స్టేడియంలు అనే మా ఆస్తులతో సంపాదన మాకు చేతకావటం లేదు. వీటిని తీసుకొని మాకు డబ్బులు ఇవ్వడానికి ఎవరైనా ఉన్నారా? అంటూ ప్రభుత్వం వీధుల్లో నిలబడింది.

# ముందుకు సాగని పునరావాసం

ఏలూరు, అక్టోబరు 5, (న్యూస్ పల్స్)రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పోలవరం నిర్వాసితులకు శాపంగా మారుతోంది. ప్రాజెక్టు పనులు జరుగుతున్న కొద్దీ గోదావరికి కొద్దిపాటి వరద వచ్చినా గ్రామాలు నీట మునగడం, నిర్వాసితులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని చెట్టుకొకరు, పుట్టకొకరుగా చెల్లాచెదురవుతుండటం రెండు సంవత్సరాలుగా చూస్తున్నాం. ఇటువంటి పరిస్థితుల్లో పునరావాస పనులను శరవేగంగా పూర్తి చేయాల్సిన అవసరం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు! 41 మీటర్ల ఎత్తును పరిగణలోకి తీసుకుని 40 శాతం పునరావాస పనులు జరిగినట్టు చెబుతున్నప్పటికీ వాస్తవం వేరు! మొత్తం ప్రాజెక్టు పనులను పరిగణలోకి తీసుకుంటే ఇప్పటివరకు పునరావాసం జరిగింది కేవలం 20 శాతం మాత్రమే! ఇంకా 80 శాతం పునరావాస పనులను పూర్తి చేయాల్సిఉంది. ఈ పనులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన నిధుల పరిస్థితి ఇంకా ఘోరం. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే ప్రాజెక్టు పనులకు సంబంధించి నిర్మాణ సంస్థలకు, కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన మొత్తం కేంద్ర ప్రభుత్వం నుండి దాదాపుగా ఎప్పటికప్పుడు వస్తోంది. అదే ప్రాజెక్టు కోసం తమ సర్వస్వాన్ని త్యాగం చేస్తున్న సామాన్య ప్రజల పునరావాసానికి సంబంధించిన నిధుల విడుదలలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం నెల కొంటోంది. తాజాగా నీటిపారుదల శాఖ తయారు చేసిన గణాంకాలను పరిశీలిస్తే పునరావాసంతోసహా మొత్తం ప్రాజెక్టు పనులు 41.53 శాతం పూర్త య్యాయి. ఇరదులో 77.43 శాతం ప్రాజెక్టు నిర్మాణ పనులు, 20.19 శాతం సహాయ పునరావాసం పనులు జరిగినట్లు అధికారులు తేల్చారు. నిర్వాసిత కుటుంబాల పరంగా చూసినప్పుడు 8 మండలాల్లోని 356 గ్రామాల్లో పోలవరం నిర్మాణంతో 1,05,601 కుటుంబాలు నిర్వాసితులున్నారు. వీరిలో కేవలం నాలుగు వేల కుటుంబాలకే పునరావాసం కల్పిం చారు. ఇది మొత్తం ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల్లో (పిఎఫ్) కేవలం నాలుగు శాతం మాత్రమే.భూ సేకరణ, పునరావాస పనుల కోసం 33,168 కోట్లు రూపాయలు ఖర్చు అవుతాయని తొలుత అంచనా వేసిన సంగతి తెలిసిందే. కేంద్రం ఆంక్షల నేపథ్యంలో దీనికి 28,172 కోట్ల రూపాయలకు కుదిస్తూ కొత్త అంచనాలను రూపొందించారు. ఈ మొత్తాన్ని విడుదల చేయడానికి కూడా కేంద్రం మీనమేషాలు లెక్కిస్తోంది. ఈ మొత్తంలో ఇప్పటి వరకు భూసేకరణకు 3, 723 కోట్లు, సహాయ పునరావాసానికి 1,413 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసింది. అధికారులు తయారు చేసిన నివేదిక ప్రకారం భూ సేకరణకు ఖర్చు చేసిన మొత్తానికి, పునరావాసానికి సంబంధించి 1376 కోట్ల రూపాయలకు బిల్లులను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు.

దీనిలో భూసేకరణకు సంబంధిరచి 3,431 కోట్ల రూపాయలు పునరావాసానికి సంబంధించి కేవలం 935 కోట్ల రూపాయలు మాత్రమే కేంద్ర ప్రభుత్వం నుండి విడుదలయ్యాయి. భూ సేకరణ పునరావాసానికి చేసిన ఖర్చుకు సంబంధించి ఇంకా 731 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిఉంది. ఇది కాక మరో 37 కోట్ల రూపాయలకు సంబంధించి బిల్లులు పోలవరం ప్రాజెక్టు అథార్టీ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఈ మొత్తం విడుదలైతే కానీ పునరావాస పనులు ముందుకు పడే పరిస్థితికనిపించడం లేదు. ఇంకా 23 వేల కోట్ల రూపాయల దాకా పునరావాసం కోసం ఖర్చు చేయాల్సిఉంది. ఖర్చు చేసిన మొత్తమే కేంద్రం నుండి రాని నేపథ్యంలో ఇంకా అవసరమైన నిధుల పరిస్థితి ఏమిటన్నది అధికారవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. హెడ్ వర్క్, కాలువలతో పాటు ఇతర పనులకు కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు ఎప్పటికప్పుడు విడుదలవుతున్నాయి. వీటిలో ఎక్కువ భాగం కాంట్రాక్టర్లకు చెల్లించేవే కావడం గమనార్హం. హెడ్ వర్క్‌కు సంబంధించి ఇప్పటివరకు 4852 కోట్ల రూపాయలు ఖర్చు చేయగా, 4391 కోట్ల రూపాయలు కేంద్రం నుండి విడుదలయ్యాయి. కుడి, ఎడమకాలువలకు సంబంధించి 2405 కోట్ల రూపాయలు ఖర్చు కాగా 2195 కోట్ల రూపాయలు విడుదలయ్యాయి.

# రాజులకు కాపు సెగ

విజయనగరం, అక్టోబరు 5, (న్యూస్ పల్స్)రాజ్యంలోనే రాజులు ఉన్నారు. అయితే అది కులం కాదని, ఎవరు గద్దెనెక్కితే వారే రాజు అని కూడా ప్రజాస్వామ్య సూత్రం ఉంది. ఇక రెండు దశాబ్దలా క్రితం వరకూ పెద్దగా సామాజిక చైతన్యం లేని రోజులలో రాజులే ఎమ్మెల్యేలుగా చాలా చోట్ల ఉండేవారు. వారిదే హవా అన్నట్లుగా కనిపించేది. ఆధునిక కాలంలోనూ మకుటం లేని మహారాజులా అధికారాన్ని చలాయించేవారు. కానీ కాలం మారింది. ఎవరి వాటా ఏంటో బాగా తెలిసింది. ఈ లెక్కలు అన్నీ కూడిన మీదట తమకూ పవర్ కావాలి అని ఆయా సెక్షన్లు అడగంతో రాజకీయ పార్టీలు ఇవ్వకతప్పింది కాదు. అలా రాజుల కోట నుంచి చాలా సీట్లు గత ఇరవై ఏళ్లలోనూ చేజారాయి.విశాఖ జిల్లా విషయనికి వస్తే రాజులకు పెట్టని కోటలుగా భీమునిపట్నం, చోడవరం, ఎలమంచిలి వంటి సీట్లు ఉండేవి. ఇక 2009 తరువాత విశాఖ నార్త్ ని కూడా వారే ఏలడం మొదలెట్టారు. అయితే రాజులు జనాభా పరంగా తక్కువ కావడంతో అక్కడ మిగిలిన సామాజిక వర్గాలు పేచీ పెట్టాయి. ఈ పరిణామంతో ముందుగా కాంగ్రెస్ సరికొత్త సమీకరణలకు తెరతీసింది. అలా భీమిలీలో దశాబ్దాలుగా ఉన్న రాజుల ఆధిపత్యానికి 2004 ఎన్నికల్లో గండి కొట్టింది. కేవలం సర్పంచుగా ఉన్న కాపు నాయకుడికి టికెట్ ఇస్తే ఆయన మాజీ మంత్రిగా ఉన్న అప్పల నరసింహ రాజుని ఓడించేశారు. అది లగాయితూ ఈ రోజుకీ మళ్ళీ భీమిలీలో రాజులకు టికెట్ ఏ పార్టీ ఇవ్వలేదు. వరసగా అక్కడ కాపులే గెలుస్తున్నారు.ఇక విశాఖ జిల్లాలో ఎలమంచిలిలో రాజులు బాగా పలుకుబడి కలిగిన వారు. దాంతో చాలా సార్లు వారు ఎమ్మెల్యేలుగా చేశారు. 2004 నుంచి ఇప్పటికి మూడు సార్లు కన్నబాబు రాజు కాంగ్రెస్, వైసీపీ తరపున గెలిచారు. కానీ 2024లో ఆయనకు కాకుండా కాపులకే టికెట్ ఇవ్వలన్న డిమాండ్ వస్తోంది. జగన్ సైతం ఈసారి వారికే ఆ సీటు రిజర్వ్ చేశారని అంటున్నారు. ఈ పరిణామంతో క్షత్రియ సామాజికవర్గం కలవరపడుతోంది. మరో వైపు చూస్తే చోడవరం నుంచి ఇప్పటికి మూడు సార్లు గెలిచిన టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజుకు కూడా వచ్చేసారి టికెట్ డౌట్ అంటున్నారు. దానికి కారణం అక్కడ కాపుల వత్తిడే. పైగా వైసీపీ నుంచి ఆ సామాజికవర్గం వారే ఎమ్మెల్యేగా ఉన్నారు. దాంతో దెబ్బ తీయాలంటే ఇది తప్పనిసరి

అని చంద్రబాబు భావించినా ఆశ్చర్యం లేదు అంటున్నారు.ఇక ఉత్తరాంధ్రా రాజులలో పేరు ఎన్నిక కన్న పూసపాటి రాజులకూ కాపుల సెగ బాగా తగులుతోంది. 2014 ఎన్నికలలో విజయనగరం నుంచి ఎమ్మెల్యేగా కాపు సామాజికవర్గానికి చెందిన మీసాల గీత గెలిచారు. అపుడు అశోక్ ఎంపీ అయ్యారు. అయితే తన పట్టు కోసం ఆయన 2019 ఎన్నికల్లో కుమార్తె అదితి గజపతిరాజుకు టికెట్ ఇప్పించుకున్నారు. అయితే ఆమె వైసీపీ చేతిలో ఓడిపోయారు. దాంతో ఈసారి కాపులకే ఈ సీటు ఇవ్వమని డిమాండ్ పెద్ద ఎత్తున వస్తోంది. చంద్రబాబు సైతం గెలుపు కోసమే చూస్తారు కాబట్టి అశోక్ సీటుని కాపులకు ఇస్తే కనుక విజయనగరంలో పూసపాటి వారి హవాకు చెక్ పడినట్లే. మొత్తానికి ఇదే వరసలో ఉత్తరాంధ్రాలో మరికొన్ని రాజుల సీట్లకు కూడా ఇతర సామాజిక వర్గాల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దాంతో రాజుల హవాకు ఉత్తరాంధ్రాలో పూర్తిగా బ్రేక్ పడినట్లే అంటున్నారు.

# క్షేత్రస్థాయి నుంచి భూ సర్వే...

విజయనగరం,అక్టోబరు 5, (న్యూస్ పల్స్)రైతులను వెంటాడు తున్న భూ సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం అడగులేస్తోంది. భూముల సమగ్ర సర్వేకు సన్నద్ధమవుతోంది. 2022 జనవరి నెల నుంచి ఈ ప్రక్రియను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. రైతుల భూములకు చెందిన రికార్డుల సమస్యలను గుర్తించిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి భూ సమగ్రసర్వే చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న 12లక్షల60వేల377ఎకరాల 20 సెంట్ల భూమిని అధికారులు సర్వే చేయనున్నారు. దీనివల్ల భూముల వివరాలు పక్కాగా నమోదవుతాయని, ఎలాంటి వివాదాలకు తావుండదని, వివాదాల్లో ఉన్న భూములకు పరిష్కారం దొరుకుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. గతంలో పట్టాదారు పాస్ పుస్తకం ఒకరిపేరు మీద ఉంటే రెవెన్యూ రికార్డుల్లో ఇంకొకరి పేరుతో ఆ భూమి ఉండేది. ఫలితంగా సంక్షేమపథకాలు సంబంధిత రైతులకు అందడంలేదు. మరోవైపు తల్లిదండ్రులు మృతిచెందితే... వారిపేరు మీద ఉన్న భూములు వారసుల పేరుకు మార్చేందుకు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సి వస్తోంది. ఈ సమస్యలన్నింటికీ సమగ్ర సర్వే ఒక్కటే మార్గమని సీఎం భావిస్తున్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం? కంటిన్యూస్ ఆపరేటింగ్ రిఫరింగ్ స్టేషన్ నెట్‌వర్క్ సాయంతో సమగ్ర భూసర్వేకు సన్నద్ధమవుతున్నారు. గ్రామాల్లో రైతులకు ఉన్న భూములను గుర్తించి ఆధార్ కార్డుల ఆధారంగా వారి వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేస్తారు. చిన్నచిన్న కమతాల నుంచి భూస్వాముల వరకూ ప్రతీది నమోదు చేస్తారు. జనవరి నుంచి ఈ పునఃసర్వే జరగనుంది. తొలుత మెట్ట ప్రాంతాలను తీసుకోగా, అనంతరం పల్లపు భూములను కొలతలు వేసి ప్యూరిఫికేషన్ చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు సర్వేయర్లతో పాటు ఇతర అధికారులకు శిక్షణ ఇస్తోంది. ముందుగా తహసీల్దార్ కార్యాలయాల్లోని రికార్డులను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తారు. అక్కడి నుంచి రికార్డులు గ్రామస్థాయిలోకి వెళ్తా యి. రైతులకు ఉన్న వాస్తవ భూమిని పరిశీలించి సరి చేస్తారు. చిన్నచిన్న సమస్యలు ఉన్నచోట వెంటనే పరిష్కరిస్తారు. పెద్ద, పెద్ద సమస్యలను తహసీల్దార్ సమక్షంలో పరిష్కరిస్తారు. క్షేత్రస్థాయి నుంచి ఈ కార్యక్రమం జరగనుంది. కోర్టులో కేసులు ఉన్నవాటి వివరాలను ప్రస్తుతానికి పెండింగ్‌లో ఉంచుతారు. మిగిలిన భూముల వివరాలు మొత్తం ఆన్‌లైన్ కానున్నాయి. వీటితో పాటు ఇంటిపట్టాల వివరాలు, పొజిషన్ సర్టిఫికెట్లు, ప్రభుత్వం ఇవ్వనున్న ఇళ్ల స్థలాలు పట్టాలు కూడా ఆన్‌లైన్ కానున్నాయి

# సాగుదారునికే డీబీటీ

నెల్లూరు, అక్టోబరు 5, (న్యూస్ పల్స్)సాగుదారుగా అధికార ధృవీకరణ ఉంటేనే ఎరువుల సబ్సిడీ ఇవ్వాలని కేంద్రం తీవ్రంగా యోచిస్తోంది. 'పిఎం కిసాన్' సహాయానికి మల్లే భూమి రికార్డులకు ఆధార్, బ్యాంక్ అకౌంట్లను అనుసంధానం చేసుకున్న రైతులనే ఎరువుల రాయితీకి అర్హత సాధించే విధంగా పక్కా వ్యవస్థను రూపొందించాలని ప్రయత్నిస్తోంది. ఎరువుల సబ్సిడీ దుర్వినియోగాన్ని అరికట్టేందుకే ఆన్‌లైన్ ధృవీకరణ అని పైకి చెబుతున్నప్పటికీ అసలు లక్ష్యం మాత్రం సబ్సిడీ నిధులకు కోతలు పెట్టేందుకేనని తెలుస్తోంది. భూ రికార్డుల్లో నమోదైన రైతులకే ఎరువుల సబ్సిడీ అందే విధానం అమల్లోకొస్తే కోట్లాది వాస్తవ సాగుదారులైన కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ ప్రభావం కౌలు సేద్యం అంతకంతకూ పెరుగుతున్న ఆంధ్రప్రదేశ్‌పై అధికంగా పడే అవకాశం ఉంది. కేంద్ర విధానంతో సాగు చేయని భూ యజమానులకు ఎం చక్కా సర్కారీ రాయితీ అందుతుంది. ప్రతి ప్రభుత్వ పథకంలో నగదు బదిలీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్-డిబిటి) అంటోంది మోడీ ప్రభుత్వం. రైతుల ఎరువుల సబ్సిడీకి 2016 అక్టోబర్‌లో మొదలుపెట్టగా దేశ వ్యాప్తంగా పూర్తి స్థాయిలో 2018 మార్చి నుండి అమల్లోకొచ్చింది. డిబిటి రాక మునుపు కేంద్రం ఎరువుల కంపెనీలకు నేరుగా సబ్సిడీ ఇచ్చేది. ఇప్పుడు రైతులు ఎంత మేరకు ఎరువులను కొనుగోలు చేస్తారో ఆ లెక్కలనుబట్టి కంపెనీలకు చెల్లిస్తోంది. ప్రతి రిటైల్ షాపులో పాయింట్ ఆఫ్ సేల్ (పిఒఎస్) డివైస్‌ను ఏర్పాటు చేసి బయోమెట్రిక్‌లో రైతు వేలిముద్రలు తీసుకొని ఎరువులు విక్రయించే పద్ధతి వచ్చింది. ప్రస్తుతానికి ఆధార్, ఓటర్ గుర్తింపు, కిసాన్ క్రెడిట్ కార్డులు చూపించి ఇ-పోస్ మిషన్‌లో వేలిముద్ర వేసి రైతులు ఎరువులు కొనుక్కుంటున్నారు.ఆధార్, ఓటర్ ఐడి చూపించి ఎరువులు కొనుక్కొనే వారందరూ రైతులేనా? వారికి భూమి ఉందా? అనే ఆలోచనలో కేంద్రం తలమునకలైంది. భూమి రికార్డుల్లో నమోదైన వారికే ఎరువుల సబ్సిడీ అందేలా చర్యలు చేపట్టాలని చూస్తోంది. ఇప్పటికే నీతి ఆయోగ్, ప్రధాన మంత్రి కార్యాలయ (పిఎంఒ) స్థాయిలో చాలా సమావేశాలు జరిగాయి. 2020-21 ఎరువుల సబ్సిడీ పద్దుపై అధ్యయనం చేసిన పార్లమెంటరీ స్థాయి సంఘంలోనూ చర్చించి సిఫారసు చేశారు. రెవెన్యూ శాఖ నిర్వహించే భూమి రికార్డుల్లో పేరు ఎక్కిన రైతు సర్వే నెంబర్ ఖాతాకు ఆధార్, బ్యాంక్ అకౌంట్ నెంబర్లను అనుసంధానం చేయాలంటోంది కేంద్రం. భూమి రికార్డుల వ్యవహారం రాష్ట్రాలది కనుక రాష్ట్రాలు సహకరించా లని కోరుతోంది. కాగా కౌలు రైతులు వేరొకరి భూములను సాగు చేస్తారు. రికార్డుల్లో యజమానుల పేర్లతో భూమి ఉంటుంది. యజమానులు సహకరిస్తేనే కౌలు రైతులు ఎరువులు కొనుక్కోగలుగుతారు. ఇదిలా ఉండగా ఎరువుల సబ్సిడీలో డిబిటిపై కేంద్రానికి కొత్త చిక్కొచ్చి పడింది. కాంట్రాక్టు సేద్యాన్ని బాగా పెంచి కార్పొరేట్లకు ఊతం ఇచ్చేందుకు ప్రత్యేక వ్యవసాయ చట్టాలను తెచ్చింది. కాంట్రాక్టు సేద్యం పరిధిలోకి పెద్ద పెద్ద భూఖండాలు వస్తాయి. అలాంటప్పుడు కాంట్రాక్టు సంస్థకు ఎరువుల సబ్సిడీ ఎలా ఇవ్వాలనే విషయంపై తర్జన భర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. పైకి మాత్రం కౌలు రైతులను ఎలా గుర్తించాలనే అంశం సవాల్‌గా ఉందని చెబుతూ, అందుకు ఎపి కౌలు రైతుల చట్టాన్ని అధ్యయనం చేస్తున్నారు. కౌలు రైతులు, భూమి యజమానుల పేర్లను వేరు చేసే ప్రక్రియ సాధ్యాసాధ్యాలపై చర్చిస్తున్నారు. ఇప్పటికే ఎపిలో రైతు భరోసా, సున్నా వడ్డీ, పంటల బీమా, పంటల కొనుగోళ్లు, సీడ్ సబ్సిడీ, యంత్ర పరికరాలు, విపత్తు పరిహారం అన్నింటికీ వెబ్ ల్యాండ్ డేటా, ఆధార్, బ్యాంక్ అకౌంట్ తప్పనిసరి. దాంతో కౌలు రైతులు ప్రభుత్వ పథకాలను కోల్పోతున్నారు. ఇక ఎరువుల సబ్సిడీ సైతం దక్కదు.

# టీడీపీకి కలవరపాటు

విశాఖపట్టణం, అక్టోబరు 5, (న్యూస్ పల్స్)ఉత్తరాంధ్ర రాజకీయాలు టీడీపీకి కలవరపాటు కలిగిస్తున్నాయి. కంచుకోట కాస్తా మంచుకోటగా మారిపోతున్న వేళ దెబ్బ మీద దెబ్బ పడిపోతోంది. బిగ్ షాట్, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు టీడీపీకి చాలా కాలంగా దూరంగా ఉంటున్నారు. ఆయన వైసీపీకి జై కొడుతున్నారు. ఆయన వెంట ఎంతమంది టీడీపీ నుంచి వెళ్తారు అంటే చాలా పెద్ద లిస్ట్ ఇపుడు వినిపిస్తోంది. వీరంతా గుడ్ బై కొడితే మాత్రం పసుపు పార్టీ తట్టుకులేని భూకంపమే అంటున్నారు. విశాఖ జిల్లాలో కనీసం ఒక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును అనుసరించడం ఖాయమని అంటున్నారు. ఇక మాజీ ఎమ్మెల్యేలు ముగ్గురుకు తక్కువ కాకుండా ఉంటారట. ద్వితీయ శ్రేణి నాయకులకు అయితే కొదవ లేదు. వారు గంటా శ్రీనివాసరావు ఎటు అంటే తమ రూటే అటే అంటారు.గంటా శ్రీనివాసరావు ఎంపీగా అనకాపల్లి నుంచి ఒకసారి పనిచేశారు. దాంతో ఆయనకు రూరల్ జిల్లా అంతటా కొట్టిన పిండి. ఆయన వర్గం పెద్ద ఎత్తున ఉంది. వారికి పార్టీ పట్టింపు లేదు. గంటా శ్రీనివాసరావుయే వారి నాయకుడు. ఈ రకమైన కల్చర్ ఉత్తరాంధ్రాలో గంటా శ్రీనివాసరావు నుంచే మొదలైంది. ఆయన్ని చూసి రాజకీయం చేసే వారే విశాఖ రూరల్ జిల్లాలో ఎక్కువ కనిపిస్తున్నారు. ఇక గంటా శ్రీనివాసరావు అనకాపల్లి, చోడవరం, భీమునిపట్నంల నుంచి ఎమ్మెల్యేగా పనిచేశారు. విశాఖ ఉత్తరం నుంచి ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దాంతో ఈ నాలుగు అసెంబ్లీ సీట్లో పెద్ద ఎత్తున అనుచర గణం గంటా శ్రీనివాసరావుకు ఉంది. ఇపుడు వీరంతా ఆయన ఎక్కడ ఉంటే తాము అక్కడే అంటున్నారు.ఇక విజయనగరం జిల్లాకు ఇంచార్జి మంత్రిగా గంటా శ్రీనివాసరావు వ్యవహరించారు. దాంతో ఇక్కడ ఆయన చక్రం కొన్నాళ్ళ పాటు గిరగిరా తిరిగింది. మాజీ ఎమ్మెల్యేలు మీసాల గీత, కొండపల్లి అప్పలనాయుడు వంటి వారు గంటా శ్రీనివాసరావు మాటే తమ బాట అంటారు. అలాగే బొబ్బిలి రాజులు కూడా గంటాకు మంచి మిత్రులు, మాజీ మంత్రి సుజయక్ క్రిష్ణ రంగారావు, సోదరుడు బేబీ నాయన కూడా చంద్రబాబు తీరు మీద తీవ్ర అసంత్రుప్తిగా ఉన్నారని ప్రచారం అయితే సాగుతోంది. దాంతో వీరు కనుక కీలక నిర్ణయం తీసుకుంటే విజయనగరం జిల్లాలో పార్టీ సగానికి సగం ఖాళీ అయినట్లే. అంతే కాదు, సాలూరు నుంచి పలు మార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆర్ పీ గిరిజన నేత భంజ్ దేవ్ సైతం గంటా శ్రీనివాసరావు వెంట నడిచే అవకాశం ఉందని అంటున్నారు.ఇక శ్రీకాకుళం జిల్లాలో ఒక టీడీపీ ఎమ్మెల్యే కూడా ఊగిసలాటలో ఉన్నారని వార్తలు వస్తున్నాయి. తమ మనిషి తోడుగా ఉంటే ఏ పార్టీలోకి అయినా వెళ్ళేందుకు రెడీ అంటున్నట్లుగా టాక్. ఇక ఇదే జిల్లాలో ఒక మాజీ మంత్రి కుటుంబం కూడా టీడీపీ పట్ల అసంత్రుప్తిగా ఉందని అంటున్నారు. వారు కనుక సైకిల్ దిగితే అతి పెద్ద నష్టం టీడీపీకి తప్పదు అంటున్నారు. మరో బిగ్ షాట్ కూడా గంటా శ్రీనివాసరావుతో గతంలో దోస్తీ చేసి వేరే పార్టీ మారి వచ్చిన వారే. ఆయన కూడా తన దారి తనది అంటే మాత్రం పసుపు పార్టీకి సిక్కోలులో చీకట్లు కమ్ముకోవడం ఖాయమని అంటున్నారు. మొత్తానికి చూస్తూంటే తొందరలోనే అతి పెద్ద రాజకీయ సునామియే ఉత్తరాంధ్రాలో వస్తుందని అంటున్నారు

# ఆ ఊరంతా టెర్రకోట కళా విక్రయాలే

తిరుపతి, అక్టోబరు 5,(న్యూస్ పల్స్)టెర్రకోట కుండలు, బొమ్మలు అంటేనే తొలుత గుర్తుకు వచ్చేది కురబలకోట మండలంలోని కంటేవారిపల్లె. బొమ్మల ఊరుగా పేరు గాంచింది. ఏ ఇంటి ముందు చూసినా రకరకాల బొమ్మలు కళకళలాడుతూ కన్పిస్తాయి. హైవేపై రాకపోకలు సాగించే వివిధ ప్రాంతాల వారు వీటి కోసం ఆగుతారు. ప్రాణం లేని బొమ్మలు మనుషలతో భావాలను పంచుకుంటున్నట్లుగా కనిపిస్తాయి. 1983లో రిషివ్యాలీ స్కూల్ టీచర్ విక్రమ్ పర్చూరే చొరవతో ప్రారంభమైన ఈ కళ నేడు దేశ విదేశాల్లో ప్రాచుర్యం పొందుతోంది. 36 ఏళ్లుగా ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతూ జనాదరణ పొందుతోంది. ఈ ఊరు మొత్తం టెర్రకోట బొమ్మలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. టెర్రకోట బొమ్మలు తొలుత ఊపిరి పోసుకుంది కంటేవారిపల్లెలోనే. ఇక్కడ 32 కుటుంబాలు ఉన్నాయి. 155 మంది హస్త కళాకారులున్నారు. డీఆర్‌డీఏ శిక్షణ కేంద్రం ఉంది. హైవే రోడ్డుపక్కనే ఈ ఊరు ఉండడంతో బొమ్మల విక్రయానికి కూడా ఈ కళకు కలిసొచ్చింది. టెర్రకోట సౌందర్యం ఇక్కడి కళాకారుల ఖ్యాతిని నలుదిశలా చాటిచెబుతోంది. వీరు తయారు చేయడమే కాకుండా కలకత్తా, గోరఖ్‌పూర్, ఢిల్లీ, అహమ్మదాబాద్, లక్నో, చెల్లి గూడ తదితర ప్రాంతాల నుంచి కూడా నాణ్యమైన బొమ్మలను తెప్పించి, వాటికి అదనపు అలంకరణలు జోడించి, తుది మెరుగులు దిద్ది, విక్రయిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులతోపాటు రాష్ట్ర గవర్నర్లుగా పనిచేసిన కుముద్‌బెన్ జోషి, కృష్ణకాంత్, రంగరాజన్ లాంటి వారు ఈ ఊరిని సందర్శించారు. కళాకారులను మెచ్చుకున్నారు. కళాకారుల చేతులే మంత్ర దండాలుగా పనిచేస్తాయి. రకరకాల బొమ్మలను ఇట్టే చేస్తారు. ఇక్కడి టెర్రకోట కళ జిల్లాలోని అంగళ్లు, పలమనేరు, సదుం, కాండ్లమడుగు, కణికలతోపు, బి.కొత్తకోట, తెట్టు, చెన్నామర్రి, సీటీఎం, ఈడిగపల్లె తదితర గ్రామాలకు విస్తరించింది. వీళ్లంతా కంటేవారిపల్లెలో నేర్చుకున్నవారే. ఇక్కడి వారు తరచూ శిక్షణ పొందుతున్నారు. ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలను పెంచుకుంటున్నారు. ట్రెండ్‌ను పసిగట్టి వ్యాపారం చేస్తున్నారు. దేశంలోని వివిధ పట్టణాలు, నగరాల్లోని ఎగ్జిబిషన్లకు వెళుతున్నారు. మరో వైపు సంస్కృతి, పల్లె కళ, సంప్రదాయాలకు ప్రతి రూపంగా ఈ మట్టిబొమ్మలు నిలుస్తున్నాయి.పండగలు, సీజన్ బట్టి వ్యాపారాన్ని చేస్తున్నాం. చవితికి వినాయక బొమ్మలు, దీపావళికి ప్రమిదలు, దసరాకు దుర్గ విగ్రహాలు, అక్కగార్ల ఉత్సవాలకు అక్కదేవతలు ఇలా కాలాన్ని బట్టి అవసరమైన వాటిని తయారు చేస్తున్నాం. వంటపాత్రలు, సాధారణ బొమ్మలు ఎప్పుడూ ఉంటాయి. రూ.20 నుంచి రూ. 2వేలు వరకు వెలగల బొమ్మలు, కుండలు ఉన్నాయి.

# పొత్తు కోసం..ఎందాకైనా

గుంటూరు, అక్టోబరు 5, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో మూడేళ్లకు ముందే రాజకీయాలు వేడెక్కాయి. ఇప్పటి నుంచే పొత్తుల కోసం పార్టీలు పరితపిస్తున్నాయి. ప్రధానంగా టీడీపీ పొత్తుల కు తాపత్రయపడుతుంది. గత ఎన్నికల్లో ఒంటరి ప్రయోగం విఫలం కావడంతో ఈసారి పొత్తులతోనే వెళ్లాలని చంద్రబాబు డిసైడ్ అయ్యారు. తమంతట తామే పొత్తులకు వెళితే సీట్ల డిమాండ్ పెరుగుతుందని తెలిసినా, త్యాగం చేయడానికి కూడా చంద్రబాబు సిద్ధమయ్యారంటున్నారు.కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో పొత్తుకు చంద్రబాబు చేయని ప్రయత్నం లేదు. ఎన్నికల్లో ఓటమి ఎదురైన నాటి నుంచి మోదీ ప్రభుత్వాన్ని విమర్శించడమే మానుకున్నారు. పెట్రోలు, డీజిల్ ధరల పెంపుదలపై కూడా రాష్ట్ర ప్రభుత్వాన్నే ఆయన విమర్శిస్తున్నారు. బీజేపీ పెద్దలకు దగ్గరవ్వాలని ప్రయత్నిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తన పార్టీకి ఆర్థికంగా ఇబ్బందులు ఎదురు కాకుండా ఉండేందుకు ఆయన బీజేపీతో పొత్తును కోరుకుంటున్నారు.బీజేపీతో పొత్తు పెట్టుకుంటే ఆటోమేటిక్ గా జనసేన కూడా కూటమిలోకి వస్తుంది. ఈ మూడు పార్టీల కలయికతో మరోసారి మ్యాజిక్ రిపీట్ అవుతుందని చంద్రబాబు భావిస్తున్నారు. అందుకే సానుకూలత వచ్చే వరకూ ఢిల్లీ గడప తొక్క కూడదని చంద్రబాబు నిర్ణయించుకున్నట్లుంది. రఘురామ రాజు విషయంలో బీజేపీ కొంత సానుకూలంగా ఉండటంతో జగన్ పట్ల వారి భ్రమలు తొలగిపోయాయని చంద్రబాబు భావిస్తున్నారు.అందుకే వచ్చే ఎన్నికల్లో పొత్తుతో వచ్చే పార్టీలు సీట్ల సంఖ్యను కూడా పెంచేందుకు ఆయన సుముఖత వ్యక్తం చేస్తున్నారు. ముందుగా జగన్ ను అధికారం దించడమే చంద్రబాబు లక్ష్యం.

## చకచకా పోలవరం జల విద్యుత్ కేంద్రం పనులు

ఏలూరు అక్టోబరు 5, (న్యూస్ పల్స్ భారీ వరదలు పోటెత్తుతున్నా పోలవరం జల విద్యుత్ కేంద్రం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇటీవలే పోలవరం జలవిద్యుత్ కేంద్రం ప్రెజర్ టన్నెల్స్ తవ్వకం పనులు ప్రారంభమయ్యాయి. జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం 12 ప్రెజర్ టన్నెల్స్ వున్నాయి. ఒక్కో టన్నెల్ పొడవు 150.3మీ. వెడల్పు 9మీ వుంటుంది. అతి తక్కువ కాలంలోనే రెండవ టన్నెల్ తవ్వకం పూర్తి అయింది. మిగతా టన్నెల్స్ తవ్వకం పనులు చురుకుగా సాగుతున్నాయి. ఇప్పటికే 21,39,639 క్యూబిక్ మీటర్ల కొండతవ్వకం పనులు పూర్తి చేసారు. పోలవరం జలవిద్యుత్ కేంద్రం కొండ తవ్వకం పనులు దాదాపు పూర్తి అయింది. జలవిద్యుత్ కేంద్రంలో 12వెర్టికల్ కల్పన్ టర్బైన్ ,ఒక్కో టర్బైన్ కెపాసిటీ 80 మెగా వాట్లు. అదేవిధంగా 12 ప్రెజర్ టన్నెల్,వీటికి 12జనరేటర్ ట్రాన్స్ఫార్మర్స్ ఉంటాయి. ఒక్కో ట్రాన్స్ఫార్మర్ 100మెగా వాట్ల కెపాసిటీ తో ఉంటుంది. జెన్కో ఎస్ ఈ: ఎస్ శేషారెడ్డి టన్నెల్ తవ్వకం పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ ఈ లు ఏ.సోమయ్య,సి.హనుమ, మేఘా ఇంజనీరింగ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ రంగరాజన్, జీఎం ముద్దుకృష్ణ, ఎజీఎం క్రాంతికుమార్,రాజేష్ కుమార్,మేనేజర్ మురళి తదితరులు పాల్గొంటున్నారు.

## అలరిస్తున్న ఏజెన్సీ అందాలు

విశాఖపట్నం అక్టోబరు 5, (న్యూస్ పల్స్)విశాఖ ఏజెన్సీని కొత్త అం దాలు అల్లుకున్నాయి.పర్యాటకులను ఆహ్లాదపరిచేందుకు వస్తున్నట్లుగా మేఘాలు భువి నుంచి దిగి వచ్చి నేల పై కమ్ముకొచ్చాయి. కింద ఉన్న చెట్లు పచ్చనితివాచీని తలపించగా.. పైన మబ్బుల దుప్పటి కప్పినట్లు కను విందు చేసిన ఈ సుందర దృశ్యం ఆహ్లాదపరిచింది. ఒక అరకు... ఒక లంబసింగి... ఇలా ఏపీ లో ఉన్న అన్ని టూరిస్ట్ అట్రాక్షన్ అన్నీ వైజాగ్ ఏజెన్సీలో దాగి ఉన్న అం దాలు.అసలు ఈ రెండు ఊర్లే కాకుం డా వైజాగ్ సిటీ కూడా చాలా అద్భుతం గా ఉంటుంది. అది ఒక అద్భుతమైన టూరిస్ట్ అట్రాక్షన్ అనే చెప్పాలి..ఇది లా ఉండగా ఇప్పుడు అక్కడ మరొక కొత్త హిల్ స్టేషన్ వంజంగి. చూడడానికి మాత్రం అద్భు తంగా ఉంటుంది. ఈ ఊరు పాడేరు మండలం హెడ్ క్వార్టర్స్ నుంచి 6 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఇది 3400 అడుగులు సముద్ర మట్టం కంటే ఎత్తు లో ఉంది. ఈ హిల్ స్టేషన్ లో ఉండి సన్ రైజ్ గనక చూస్తే ఆ ఫీలింగే వేరు. దానిని మాటల్లో వర్ణించ లేము. మబ్బు ల మధ్యలో ఉన్నామా అనే ఫీలింగ్ రాక తప్పదు.

## అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

డోన్ అక్టోబరు 5, (న్యూస్ పల్స్)డోన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాతపేట,లో మంగళవారంపాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మావతమ్మ అధ్యక్షతన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారని సీనియర్ ఉపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి తెలిపారు..ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఐక్య రాజ్య సమితి 1994 వ సంవత్సరంలో సమాజంలో ఉపాధ్యాయుల స్థాయి , గౌరవాన్ని పెంచేలా ప్రతి సంవత్సరం అక్టోబర్ 5 వ తేదీని ఉపాధ్యాయ దినోత్సవం గా నిర్వహించాలని కోరింది, ఆధునిక సాధనాలు ఎన్ని ఉన్నా, బోధన సామాజిక మాధ్యమాల ద్వారా జరిగినా, ఉపాధ్యాయునికి అది ప్రత్యామ్నాయం కాదు అన్నారు, కంప్యూటర్ ఎప్పటికీ టీచర్ కాదు. అట్టి ఉపాధ్యాయుని గొప్పతనాన్ని గుర్తించిన యునెస్కో 1994 అక్టోబర్ 5ను అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం గా ప్రకటించిందని తెలిపారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులవలె ఎప్పటికప్పుడు కొత్త విషయాలు, ప్రపంచ పోకడలు నేర్చుకొని విద్యార్థులను భావి ప్రపంచ పౌరులుగా, ఎంతటి సవాళ్లనైనా ఎదుర్కొనే నేర్పరులుగా తీర్చిదిద్దాలని కోరారు.ఈ సందర్భంగా రామానాయుడు అనే పేరెంట్ ప్రధానోపాధ్యాయులు పద్మావతమ్మ గారిని శాలువా కప్పి పూలమాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శివ ప్రసాద్, వెంకటేశ్వర్ గౌడ్, లక్ష్మయ్య, వెంకట రమణ, లక్ష్మీకాంత రెడ్డి, చంద్రశేఖర్ గౌడ్,రాధ,మునిరాజు, మధుసూదనరెడ్డి,సురేష్, సుభాన్ బాషా, రాఘవేంద్ర, వెంకటలక్ష్మి, శ్రీకళ, దేవేంద్రప్ప,యం.ఏ.శ్రీనివాసులు, వై.శ్రీనివాసులు, యు.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల పై దాడి చేసిన కేంద్ర మంత్రి కుమారుడు ఆశిష్ మిశ్రా ను కఠినంగా శిక్షించాలి

నంద్యాల అక్టోబరు 5, (న్యూస్ పల్స్)మంగళవారం నాడు నంద్యాల ఇండియన్ యూనియన్ ముస్లిం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ జిల్లా కార్యదర్శి సలాం మౌలానా. జానో జాగో జాతీయ కార్యదర్శి సయ్యద్ మహబూబ్ బాషా. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ ఉమర్. నంద్యాల పట్టణ ఇంచార్జ్ అక్బర్ ఖాన్ . మాట్లాడు తూ రైతులు చేస్తున్న నల్ల చట్టాలకు వ్యతిరేకంగా చేస్తున్న ఉద్యమంలో కేంద్రమంత్రి స్వగ్రామంలో ఆయన కుమారుడు రైతులపై కారు పోనిచ్చి రైతుల మృతికి కారణమైన ఆయన కుమారుని కేంద్ర మంత్రిని వెంటనే మంత్రివర్గం నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. అలాగే మనము రాజ్యాంగ వ్యవస్థ లో ఉన్నామా లేక పోతే అటవిక రాజ్యాంగంలో ఉన్నామా అని వారు అన్నారు. ఈ సంఘటన సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా ఉందని రైతు కంట కన్నీరు కార్చిన ఏ ప్రభుత్వము బాగుపడిన దాఖలాలు లేవని అన్నారు. కానీ నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతు కంట కన్నీరు కలుస్తుందని రాబోయే రోజుల్లో వీరి యొక్క ప్రభుత్వం పుట్టగతులు లేకుండా పోతుందని అన్నారు. ఈ చరిత్రలో బ్రిటిష్ ప్రభుత్వం కూడా ఇంత కఠినంగా వివరించలేదని దేశానికి వెన్నెముక అయిన రైతులపై ఇలాంటి సంఘటన చూస్తుంటే బిజెపి ప్రభుత్వం రైతులను భయభ్రాంతులకు గురి చేసి ఉద్యమాన్ని నీరుగార్చేలా చేయాలని చూస్తుంది అని అన్నారు. కానీ రాబోయే రోజుల్లో ప్రజలు దేశవ్యాప్తంగా బిజెపిని సమాధి చేసి రోజు దగ్గరలో ఉన్నాయని వారు అన్నారు.

## దుర్గమ్మ దసరా ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, కమిషనర్

విజయవాడ ఇంద్రకీలాద్రి లో దసరా ఉత్సవాల ఏర్పాట్ల ను జిల్లా కలెక్టర్ జె. నివాస్, విజయవాడ సీపీ బత్తిన శ్రీనివాసులు మంగళవారం నాడు పరిశీలించారు. శనీశ్వరలయం నుండి మహామండపం వరకు క్యూ లైన్లు, స్నానపు ఘాట్ లు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ జె. నివాస్ మాట్లాడుతూ ఈ నెల 7 నుండి 15 వరకు ఇంద్రకీలాద్రి పై దసరా ఉత్సవాలు జరగనున్నాయి. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. గత సంవత్సరం మాదిరిగానే రోజుకు పదివేల మందికి టైం స్లాట్ ప్రకారం భక్తులకు అనుమతి ఇస్తాం. కోవిడ్ నేపథ్యంలో క్యూ లైన్లలో ఎక్కువ ప్రదేశాలలో సానిటైజర్స్ పాయింట్లు ఏర్పాటు చేసాం. ఈ సారి ఉత్సవాలలో హెలిప్యాడ్ రైడ్ ను అందుబాటులో కి తెచ్చాం. ఉత్సవాలకు వచ్చే భక్తులు విజయవాడ ను హెలిప్యాడ్ ద్వారా వీక్షించవచ్చని అన్నారు.విజయవాడ సీపీ బత్తిన శ్రీనివాసులు మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది. బందోబస్తు లో భాగంగా నాలుగుఅంచెల భద్రత ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సారి కరోనా కారణంగా అన్నదాన కార్యక్రమం లేదు.. భక్తులకు పోట్లలా రూపంలో అన్నప్రసాదం అందచేస్తాం. మూల నక్షత్రం రోజు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా అమ్మవారి దర్శన భాగ్యం కల్పిస్తామని అన్నారు..

# శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



తిరుమల అక్టోబర్ 05 తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ కార్యక్రమంలో టిటిడి ఈవో డాక్టర్ కె.ఎస్.జవహర్రెడ్డి, అదనపు ఈవో ఎవి.ధర్మారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈవో మీడియాతో మాట్లాడుతూ అక్టోబరు 7 నుండి 15వ తేదీ వరకు శ్రీవారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించినట్లు చెప్పారు. సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆలయంలోని ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ప్రసాదాల పోటు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పుతోపాటు పూజాసామగ్రిని శుద్ధి చేసినట్టు తెలిపారు.కాగా, ఆలయంలో ఉదయం 6 నుండి 10 గంటల వరకు శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించారు. ఈ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి వేశారు. శుద్ధి పూర్తి అయిన అనంతరం నామకోపు, శ్రీ చూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆ తరువాత భక్తులను దర్శనానికి అనుమతించారు.

# అడ్డదారి పడుతున్న ఇసుక నిల్వలు



నల్లగొండ, అక్టోబరు 5, (న్యూస్ పల్స్) ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించడం లేదు. చట్టాలు, విధానాల్లోని లొసుగులను ఆసరగా చేసుకుని ఇసుక వ్యాపారులు ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ తమ దందాను దర్జాగా సాగిస్తున్నారు. ఇటీవల మునుగోడు మండలంలో కొంపెల్లికి చెందిన ఓ వ్యాపారి, నారాయణపురం మండలానికి చెందిన మరో వ్యాపారి బినామీల పేరిట ఇసుకను బుకింగ్ చేసుకుని రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడడంతో దందా వెలుగులోకి వచ్చింది. ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఏడాది క్రితం సాండ్ టాక్స్ విధానాన్ని అమలులోకి తెచ్చింది. ఈ విధానాన్ని అధికారులు పకడ్బందీగా అమలు చేయడంతో ఇసుకాసురుల ఆటలు సాగలేదు. ఈ విధానంలో ఇసుక అవసరమైన వ్యక్తులు ఆన్లైన్లో బుక్చేసుకుని డబ్బులు చెల్లిస్తే.. ఇసుక రవాణాచేసే ట్రాక్టర్ నంబర్తో పాటు ఓటీపీ నంబర్ ఆ వ్యక్తి సెల్కు మేసేజ్ వస్తుంది. వచ్చిన ఇసుకని అన్లోడు చేయించుకున్న వ్యక్తి ఆ ఓటీపీ నంబర్ ట్రాక్టర్ యజమానికి ఇస్తే దానిని ఆయన ఆన్లైన్లో నమోదు చేసుకుంటే ట్రాక్టర్ రవాణా చార్జి ఆన్లైన్లో చెల్లిస్తారు.అయితే ఇలా జిల్లా వ్యాప్తంగా కొనసాగిస్తుండడంతో కొంత కా లంగా ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టపడింది. సాధారణంగా ఇసుక అవసరమైన వారు మాత్ర మే సాండ్టాక్స్ పద్ధతిన ఆన్లైన్లో బుక్ చేసుకుని డబ్బులు చెల్లిస్తారు. కానీ మునుగోడు మం డలంలోని వ్యాపారులు ఇసుక అవసరం లేని వారి పేరు మీద ఆన్లైన్ బుక్ చేసి డబ్బులు చెల్లిస్తున్నారు. వచ్చిన ఇసుకను గ్రామ శివార్లలో ఎనిమిది ట్రాక్టర్ల చొప్పున డంప్ చేసి రాత్రి వేళల్లో జేసీబీల సహాయంతో లారీల్లో లోడ్ చేసుకుని దర్జాగా హైదరాబాద్కు తరలిస్తున్నారు. దీంతో ఉదయం సమయంలో అధికారికంగా అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లని అడ్డుకునే నాథుడే కరువయ్యాడు.ప్రస్తుతం వర్షాలు సంవృద్ధిగా కురిసి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రాష్ట్రంలో ఎక్కడా కూడా ఇసుక తోడే పరిస్థితి లేదు. ప్రధానంగా కాళేశ్వరంలో ఇసుక తోడేందుకు ఇబ్బం దిగా మారండంతో ఒక్కో లారీకి నెలలో ఒకటి రెండు ట్రిప్పులు మాత్రమే అవకాశం వస్తోంది. దీంతో హైదరాబాద్లో ఇసుక కొరత ఏర్పడింది. దీంతో ఇసుక ధరకు రెక్కలు వచ్చాయి. గతంలో టన్ను ఇసుక రూ. 1300కు విక్రయించగా ప్రస్తుతం రూ.1800ల నుంచి రూ.2500ల వరకు అమ్ముతున్నారు. హైదరాబాద్కు కేవలం 70 కిలో మీటర్ల దూరంలో మునుగోడు, నారమణపురం మండలాల నుంచి ఇసుక రవాణాచేస్తే లారీ యజమానులకు రావాణా భారం తగ్గుతుంది. అయితే ఆ రవాణా ఖర్చుల కింద సాండ్ టాక్స్ ద్వారా తమ డంపింగ్ కేంద్రాల వద్ద ఇసుక పోస్తున్న ట్రాక్టర్ యజమానులకు ట్రిప్పుకు అదనంగా రూ.వెయ్యి చెల్లిస్తున్నారు. ఒక లారీలో 32 టన్నులు ఇసుక లోడు చేసేందుకు 8 ట్రాక్టర్ల ఇసుక అవసరం ఉంటుంది. అయితే ఆ ట్రాక్టర్కు రూ. సాండ్ టాక్స్ ఒక్కోక ట్రాక్టర్కు రూ. రూ.2,400లకు లభిస్తుండగా రూ. 19,200లకు లోడు అవుతుంది. అలా డంప్లో ఇసుక పోసిన ట్రాక్టర్స్కి వ్యాపారులు రూ. 1000 చెల్లించగా వారికి రూ. 2,7200 ఇసుక రావడంతో పాటు డీజిల్ ఖర్చు రూ.5వేలతో మొత్తం 32 టన్నుల ఇసుక హైదరబాద్కు తరిలిపొతోంది. ఆ ఇసుకని రూ.2వేల చొప్పున విక్రయించినా దాదాపు రూ. 64 వేలు రాగా అందులో ఖర్చులు పోను రూ.30వేలపైనే ఆదాయం వస్తోంది. మండలం లో 20 రోజులుగా రోజుకు 10 లారీల చొప్పున ఇసుకను హైదరాబాద్కు రవాణా చేస్తూ ఇసుకాసురులు సొమ్ము చేసుకుంటున్నారు.సాండ్ టాక్స్ విధానంలో కొన్ని నిబంధనలు పెడితేనే ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ముఖ్యంగా గతంలో ఇసుక అవసరం ఉన్న వ్యక్తి ఫోన్ నంబర్తో పాటు ఆధార్కార్డును కూడా అప్లోడ్ చేసిన తర్వాతే బుకింగ్ చేసుకునే వారు. కొంతకాలంగా ఆధార్ కార్డు లేకున్నా కేవలం ఫోన్ నంబర్ ఆధారంగా బుక్ చేసుకున్న వ్యక్తికి రోజుకు 5 ట్రాక్టర్ల చొప్పున ఇసుకను రవాణా చేస్తున్నారు. ప్రస్తుతం ఇదే ఇసుకాసురులకు వరంగా మారింది. అయితే ప్రస్తుతం ఉన్న సాండ్ టాక్స్ విధానంలో ఇసుక అవసరం ఉన్న వ్యక్తి ఆధార్కార్డుతో పాటు సదరు వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతున్నాడా లేదా అని సంబంధిత అధికారి ధ్రువీకరణ పత్రాన్ని కూడా అప్లోడ్ చేసే విధంగా షరతు విధిస్తే ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడవచ్చనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం మండలంలోని కొరటికల్ గ్రామ వాగు నుంచి సాండ్టాక్స్ విధానంతో ఇసుక రవాణా జరుగుతోంది. అయితే ఆ వాగు నుంచి ఇసుక రవాణాచేసే ట్రాక్టర్ యజమానులను వ్యాపారులు మచ్చిక చేసుకుని దందా సాగిస్తున్నారు. బినామి పేర్లతో బుక్ చేసుకున్న వ్యాపారులు ఇసుక రవాణా చేసే ట్రాక్టర్ యజమానులకు అదనంగా కొంత డబ్బు చెల్లించి మండలంలోని కొంపల్లి, చల్మెడ, వెల్మకన్నె, కల్వ కుంట్ల, గూడపూర్ గ్రామాల్లోని నిర్మానుష్య ప్రదేశాల్లో ఇసుకని డంప్ చేసి అక్రమ రవా ణాకు పాల్పడుతున్నారు. ఇలా 20 రోజులుగా ప్రతి రోజు దాదాపు 10 లారీల్లో ఇసుకను హైదరాబాద్కు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

# ఎన్నికలలో అక్రమాలను నిరోధించడానికి సి - విజిల్ యాప్ ఒక బ్రహ్మాస్త్రం

**- సబ్ కలెక్టర్, బద్వేలు ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేతన్ గార్గ్సి**

**- విజిల్ యాప్ లో ఫిర్యాదు ఇచ్చిన కొద్ది నిమిషాల్లోనే చర్యలు**

**ఎన్నికల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సి - విజిల్ యాప్ ను వినియోగించాలి**

బద్వేలు, అక్టోబర్ -05 ఎన్నికలలో అక్రమాలను నిరోధించడానికి సి - విజిల్ యాప్ ఒక బ్రహ్మాస్త్రంలా పనిచేస్తుందని... ఎన్నికలలో ఎలాంటి అక్రమాలు దృష్టికి వచ్చిన ప్రజలు వెంటనే సి - విజిల్ యాప్ లో ఫిర్యాదు చేయాలని సబ్ కలెక్టర్ మరియు బద్వేలు ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేతన్ గార్గ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సి విజిల్ యాప్ లో పిర్యాదు అందుకున్న కొద్ది క్షణాల్లో చర్యలు తీసుకుని అక్రమాలకు అడ్డు కట్ట వేయడం జరుగుతుందన్నారు. 124-బద్వేలు నియోజకవర్గ పరిధిలో బద్వేలు ఉప ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన మరియు ఎన్నికల వ్యయ ఉల్లంఘన జరిగితే దృష్టికి తేవాలన్నారు. ఎన్నికలలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి విచ్చల విడిగా డబ్బు ఖర్చుపెట్టడాన్ని నిరోధించడానికి భారత ఎన్నికల సంఘం ప్రజల చేతికి ఒక బ్రహ్మాస్త్రాన్ని సి.విజిల్ యాప్ రూపంలో అందించడం జరిగిందని, ప్రతి పౌరుడు భాద్యతాయుతంగా వ్యవహరిస్తూ ఎన్నికలు సజావుగా జరగడానికి సహకరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రజల చేతిలో ఒక స్మార్ట్ ఫోన్ ఉండి... దానిలో సి.విజిల్ యాప్ డౌన్లోడ్ చేసుకుని... ఎన్నికలలో ఎక్కడైనా జరిగే అక్రమాలు దృష్టికి వస్తే వెంటనే వాటిని తమ సెల్ ఫోన్ లో ఫోటోలు, వీడియోలు మరియు ఎవరైనా సభలు, సమావేశాల్లో ఉద్దేశపూరితంగా కామెంట్ చేసినా చిత్రీకరించి అందుకు సంబంధించిన సమాచారాన్ని కూడా కొద్దిగా జోడించి అప్లోడ్ చేసి పంపితే నేరుగా ఎన్నికల కమిషన్ కు వెళ్తాయన్నారు. వారు జిపిఎస్ ట్రాక్ చేసి లొకేషన్ మ్యాప్ చేస్తారని, అక్కడి నుంచి సమీపంలో జిల్లా కంట్రోల్ రూమ్ కు సమాచారం వెళ్తాయని, వాటిని ఫిర్యాదు చేసిన లొకేషన్ కు దగ్గర్లో ఉన్న ఎన్నికల తనిఖీ బృందాలకు సంబంధిత అధికారులు పంపుతారని... వెంటనే స్పెషల్ పార్టీ రంగంలోకి దిగి అక్రమాలను అడ్డుకుంటారని ఇదంతా కొన్ని నిమిషాల్లోనే జరిగిపోతుందన్నారు. బెదిరించడం, విద్వేష పూరిత ప్రసంగాలు చేయడం, ఒకరి కనుగుణంగా వార్తలు ప్రసారం చేయడం, తప్పుడు వార్తలు ప్రసారం, నగదు, బహుమతులను పంపిణీ చేయడం, ఓటర్లను ఉచితంగా తరలించడం, ఆస్తులను నాశనం చేయడం వంటి ఉల్లంఘనలకు పాల్పడిన చిత్రాలను, వీడియోలను సి విజిల్ మొబైల్ యాప్ ద్వారా అప్లోడ్ చేయాలని, పిర్యాదు చేసిన కొద్ది నిమిషాల్లో సమస్యలను పరిష్కరించబడతాయని అన్నారు. స్వేచ్ఛగా, శాంతియుతంగా ఓటింగ్ జరగటానికి సి - విజిల్ అగ్రగామిగా నిలబడుతుందని, ప్రతి పౌరుడు బాధ్యతగా సి - విజిల్ యాప్ గురించి అవగాహన పొంది ఉపయోగించాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

## బందరు పోర్టు సాధనకై బీజేపీ నిరసన దీక్ష

మచిలీపట్నం బందరు పోర్టు సాధనకై బీజేపీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ ధర్నా చౌక్ నందు జరిగిన నిరసన దీక్షలో రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు పాల్గొన్నారు. జీవీఎల్ మాట్లాడుతూ ప్రధాన ప్రతిపక్షం టీడీపీ తన బాధ్యతను విమర్శించింది. రాజకీయ ఉనికి లేకపోయినా బీజేపీ పోరాడుతూనే ఉంది. అనాదిగా మచిలీపట్నం వివక్షకు గురవుతూ వస్తోంది. పోర్టు వస్తేనే అభివృద్ధి జరుగుతుందన్న చర్చ తప్ప కార్యరూపం దాల్చడం లేదు. ఐదుగురు సీఎంలు వచ్చి పోర్టుకు శంకుస్థాపన చేసి ఈ ప్రాంత ప్రజలను మోసగించారు. ఇటువంటి రాజకీయ నేతలకు గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉంది. సినిమా టికెట్లు అమ్మాలన్న శ్రద్ధ బందరు పోర్టు మీద పెడితే బాగుండేది. 2024లో మచిలీపట్నం ఎంపీగా బీజేపీని గెలిపిస్తే పోర్టు కలను సాకారం చేసి చూపిస్తాం.

## కానిస్టేబుల్ రాసలీలలు

విశాఖపట్టణం, అక్టోబరు 5, (న్యూస్ పల్స్)ఒకరు కాదు..ఇద్దరు కాదు..నలుగురితో పెళ్లి..పలువురితో వివాహేతర సంబంధాలు. ఇది ఓ కానిస్టేబుల్ వ్యవహారం. బాధితురాలి ఫిర్యాదుతో ఈ బాగోతం బయటపడింది. మహిళల జీవితాలతో ఆటలాడుకుంటున్న పోలీస్పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.విశాఖపట్నానికి చెందిన అప్పలరాజు అలఖీః కానిస్టుబుల్గా పనిచేస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఈయనగారు నిత్య పెళ్లికొడుకుగా అవతారమెత్తారు. ఒకరికి తెలియకుండా మరొకరిని వివాహం చేసుకుంటూ జాగ్రత్తపడ్డాడు. ఒకరు కాదు ఇద్దరు కాదు మొత్తం నాలుగు పెళ్లిళ్లు చేసుకున్నాడు. అయ్యగారు అంతటితో ఆగలేదు. పలువురు మహిళలతో వివాహేతర సంబంధాలు పెట్టుకున్నట్లు బాధిత మహిళలు ఆరోపిస్తున్నారు. అప్పలరాజును పెళ్లి చేసుకున్న పద్మ.. మహిళా సంఘాలతో కలిసి మీడియాను ఆశ్రయించడంతో కానిస్టేబుల్ అసలు భాగోతం వెలుగులోకి వచ్చింది.కానిస్టేబుల్ అప్పలరాజు తనతోపాటు పలువురు మహిళలను మోసం చేశారని ఆమె ఆరోపించింది. తనకు తెలియకుండానే నాలుగుసార్లు అబార్షన్ చేయించారని ఆవేదన వ్యక్తం చేసింది. తనతోపాటు నలుగురు మహిళలను పెళ్లిళ్లు చేసుకొని వేర్వేరు ప్రాంతాల్లో కాపురం పెట్టారని కుండబద్దలు కొట్టి చెబుతోంది. ఇదేంపని ప్రశ్నించినందుకు తనను దూరం పెట్టాడని ఆరోపించింది. గతంలో ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో అతని ప్రవర్తనలో కొంత మార్పు వచ్చిందని తెలిపింది. ఐతే అప్పలరాజు మళ్లీ అలాగే ప్రవర్తిస్తున్నారని..తనకు న్యాయం చేయాలంటోంది బాధితురాలు పద్మ.మరోవైపు మహిళల జీవితాలతో ఆడుకుంటున్న కానిస్టేబుల్ అప్పలరాజుపై చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల నాయకురాలు డిమాండ్ చేస్తున్నారు. మహిళల జీవితాలతో చెలగాటమాడుతున్న కీచక కానిస్టేబుల్ను వెంటనే అతన్ని సస్పెండ్ చేసి?అరెస్టు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు ఇందుకు సంబంధించి పోలీసు ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టారు.

## ఐపీఎల్ కొత్త టీమ్ 4000 కోట్లు!

ముంబై అక్టోబర్ 5 ఇండియన్ ప్రిమియర్ లీగ్( ఐపిఎల్ )లో వచ్చే ఏడాది రెండు కొత్త టీమ్స్ రాబోతున్న నేపధ్యం లో ఈ కొత్త ఫ్రాంచైజీలను ఈ నెల 25న బీసీసీఐ అధికారికంగా ప్రకటించనుంది. వీటిలో ఒక్కో టీమ్ కనీస ధరను రూ.2 వేల కోట్లుగా నిర్ధారించారు. అయితే ఈ ధర 50 నుంచి 100 శాతం పెరగొచ్చని ప్రస్తుత ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ కోఓనర్ నెస్ వాడియా అంచనా వేశారు. ఆ లెక్కన ఒక్కో టీమ్ రూ.3000 కోట్ల నుంచి రూ.4000 కోట్ల వరకూ పలకవచ్చని ఆయన అన్నారు. ఈ రెండు కొత్త టీమ్స్ రాకతో ఐపీఎల్ విలువతోపాటు ఇప్పుడున్న ఫ్రాంచైజీల విలువ కూడా పెరుగుతుందని నెస్ వాడియా అభిప్రాయపడ్డారు.ఐపీఎల్లో నాకున్న అనుభవం, కొద్దిపాటి నాలెడ్జ్తో చెబుతున్నా.. చాలా ఆలోచించే బీసీసీఐ ఈ కనీస ధరను నిర్ణయించింది. ఇది నాకు తెలిసి 50 నుంచి 100 శాతం పెరగొచ్చు. కనీసం రూ.3 వేల కోట్లపైనే ఉంటుంది అని నెస్ వాడియా అన్నారు. అందరూ ఐపీఎల్లో ఆడాలనుకుంటారు కానీ.. కొందరికీ ఆ అవకాశం వస్తుంది అని వాడియా అభిప్రాయపడ్డారు. రెండు కొత్త టీమ్స్ చేరిక అనేది ఐపీఎల్తోపాటు ఇప్పుడున్న ఫ్రాంచైజీలు, బ్రాడ్కాస్టర్లకు కూడా మంచే చేస్తుందని అన్నారు. ఓ మంచి లొకేషన్లో బిల్డింగ్ ఉండి, మీ చుట్టూ బాగా డెవలప్ అవుతుంటే మీ వాల్యూ ఎలా పెరుగుతుందో ఇప్పుడూ అదే జరుగుతుందని చెప్పారు.

## అధికారుల సహకారంతో అక్రమ మైనింగ్ ను అరికడదాం...

**ఏడి నాగిని**

కర్నూలు అక్టోబరు 5, (న్యూస్ పల్స్) రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు కర్నూలు జిల్లాలో సహాయ సంచాలకులు భూగర్భ గనుల శాఖలో బదిలీ చేశారని, అధికారుల ఆదేశాల మేరకు వెంటనే ఇక్కడ బాధ్యతలు స్వీకరించినట్లు ఏ.డి నాగిని తెలియజేశారు.తనకు కర్నూలు జిల్లాలో పనిచేసిన అనుభవం ఉందన్నారు.కర్నూలు జిల్లా కలెక్టర్ మరియు భూగర్భ గనుల శాఖ ఉపసంచాలకులు సహకారంతో అక్రమ మైనింగ్ కు అడ్డుకట్ట వేయాగలనని ఆత్మవిశ్వాసంతో ఆమె అన్నారు.రాయల్టీలు సక్రమంగా ఉండేలా అన్ని చర్యలు తీసుకోవాలని,ఇప్పటికే గనుల యజమానులకు తగు సూచనలను ఇచ్చినట్లు ఆమె తెలియజేశారు.మైనింగ్ సిబ్బంది సహాయ సహకారాలతో కర్నూలు పరిధిలో అక్రమ మైనింగ్ నిరోధించగలనని ఆమె తెలియజేశారు.

## ఖజానా శాఖ నూతన డి.డి గా రామచంద్ర మూర్తి

కర్నూలు అక్టోబరు 5, (న్యూస్ పల్స్)దీర్ఘకాలంగా కర్నూలు జిల్లా ఖజానా శాఖ ఇన్చార్జ్ డి.డి పాలనలో కొనసాగింది.తమ సమస్యలు ఎవ్వరికీ చెప్పుకోవాలో తెలియక రిటైర్డ్ ఎంప్లాయిస్ తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు,ఇలాంటి తరుణంలో సునిత మనస్కుడైన రామచంద్ర మూర్తి కర్నూలు జిల్లా ఖజానా శాఖ ఉపసంచాలకులు గా పదవీ బాధ్యతలు స్వీకరించారు.అకౌంట్స్ ఆఫీసర్ నుండి ప్రమోషన్ పై ఉప సంచాలకులుగా కర్నూలుకు రావడం జరిగిందన్నారు.తమ శాఖలో ఎవరైనా రిటైర్డ్ ఎంప్లాయిస్ వారి సమస్యలు పరిష్కారం జరగకపోతే తనను కలవవచ్చని తెలియజేశారు.తన సిబ్బందితో సత్వరమే సమావేశం ఏర్పాటు చేసి దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న రిటైర్డ్ ఎంప్లాయిస్ సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు.అలాగే నియోజకవర్గ ప్రాంతాలలో ఉన్న ఎస్.టి.వో కార్యాలయంను తనిఖీ చేసి సమస్యల పరిష్కారానికి ఉన్నత అధికారులకు నివేదిక పంపి వాటిని పరిష్కరిస్తామని ఆయన తెలియజేశారు.

## సేఫ్ ప్లేస్ లోకి రాధా

విజయవాడ, అక్టోబరు 5, (న్యూస్ పల్స్)వంగవీటి రాధా వచ్చే ఎన్నికలలో ఎక్కడి నుంచి పోటీ చేస్తారు? ఆయనను తెలుగుదేశం పార్టీ ఎక్కడ ఉపయోగించుకుంటుంది? పార్లమెంటు సభ్యుడిగా పంపుతారా? లేక శాసనసభ స్థానాన్ని కేటాయిస్తారా? అన్న చర్చ జరుగుతోంది. ఇటీవల కాలంలో వంగవీటి రాధా కొంత యాక్టివ్ అయ్యారు. మరో రెండున్నరేళ్లు ఎన్నికలు ఉండటంతో ఈసారి ఎలాగైనా విజయం సాధించి తన రాజకీయ భవిష్యత్ ను మెరుగుపర్చుకోవాలని వంగవీటి రాధా భావిస్తున్నారు. టీడీపీ అధినాయకత్వం కూడా రాధా ప్లేస్ కోసం వెతుకుతోంది.ఇప్పటికే అనేక పార్టీలు మారిన వంగవీటి రాధా మరోసారి ఆ తప్పు చేయరని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. రాజధాని తరలింపు వ్యవహారంతో టీడీపీ ఇక్కడ బలంగా ఉందని, ఇప్పుడు మరో పార్టీలోకి మారి సాహసం చేసే అవసరం లేదని వంగవీటి రాధా భావిస్తున్నారు. అయితే వంగవీటి రాధా కు సెంట్రల్ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని ఆసక్తి మెండుగా ఉంది. అయితే అక్కడ ఆయనకు అవకాశాలు కష్టమేసెంట్రల్ నియోజకవర్గంలో టీడీపీ నేత బొండా ఉమామహేశ్వరరావు బలంగా ఉన్నారు. కాపు సామాజికవర్గానికి చెందిన బొండా ఉమ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కూడా. గత ఎన్నికల్లోనూ ఆయన స్వల్ప ఓట్ల మెజారిటీతోనే ఓటమి పాలయ్యారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాల దర్భ చాప, తాడు ఊరేగింపు

తిరుమల,మా ప్రతినిధి,అక్టోబర్ 05, శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలలో ధ్వజారోహణంకు ఉపయోగించే దర్భ చాప, తాడును వరాహస్వామి అతిథి గృహాల వద్ద ఉన్న టిటిడి అటవీ విభాగం కార్యాలయం నుండి మంగళవారం డిఎఫ్‌వో శ్రీ శ్రీనివాసులు రెడ్డి, సిబ్బంది ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం శ్రీవారి ఆలయం రంగనాయకుల మండపంలోని శేషవాహనంపై దర్భతో తయారుచేసిన చాప, తాడును ఉంచారు. ఈ నెల 7వ తేదీ జరిగే ధ్వజారోహణంలో వీటిని ఉపయోగిస్తారు.ధ్వజారోహణంకు దర్భ చాప, తాడు కీలకం బ్రహ్మోత్సవాల ఆరంభానికి సూచికగా ధ్వజారోహణం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభం మీదకు గరుడ పతాకం ఎగురవేసి ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారు. రుత్వికులు వేద మంత్రాలతో దర్భ చాపను ధ్వజస్తంభం చుట్టూ చుడతారు. దర్భతో పేనిన తాడును ధ్వజస్తంభంపై వరకు చుడతారు. వీటి తయారీ కోసం టిటిడి అటవీ శాఖ 10 రోజుల ముందునుంచే కసరత్తు చేస్తుంది. దర్భలో శివ దర్భ, విష్ణు దర్భ అనే రెండు రకాలు ఉండగా, తిరుమలలో విష్ణు దర్భ ఉపయోగిస్తారు. ఇందుకోసం వడమాల పేట పరిసర ప్రాంతమైన చెల్లూరు పంటకాలువల మీద పెరిగే ఈ దర్భను టిటిడి అటవీ సిబ్బంది సేకరిస్తారు. దీన్ని తిరుమలకు తెచ్చి తక్కువ ఎండలో వారం రోజులు ఎండబెడతారు. ఆ తరువాత దర్భను బాగా శుభ్రపరచి, చాప, తాడు తయారు చేస్తారు. ధ్వజారోహణంకు 5.5 మీటర్ల పొడవు, 2 మీటర్ల వెడల్పు చాప, 175 అడుగుల తాడు అవసరం అవుతాయి. అయితే అటవీశాఖ ఈ సారి 7 మీటర్ల పొడవు, 2 మీటర్ల వెడల్పుతో చాప, 211 అడుగుల పొడవు తాడు సిద్ధం చేసింది.

## ముగ్గురు శాస్త్రవేత్తలను వరించిన భౌతిక శాస్త్ర నోబెల్ ప్రైజ్

న్యూఢిల్లీ అక్టోబర్ 5 : ఈ ఏడాది భౌతిక శాస్త్ర నోబెల్ ప్రైజ్ ముగ్గురు శాస్త్రవేత్తలను వరించింది. సంక్లిష్ట భౌతిక వ్యవస్థలపై మన అవగాహనకు సంబంధించి వీళ్లు చేసిన రచనలకుగాను ఫిజిక్స్ నోబెల్‌ను ప్రకటించారు. స్యుకురో మనాబె, క్లాస్ హాసెల్‌మాన్, గియోర్గియో పారిసిలకు ఫిజిక్స్ నోబెల్ ఇస్తున్నట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మంగళవారం ప్రకటించింది. నోబెల్ బహుమతితోపాటు ఇచ్చే ప్రైజ్‌మనీలో సగం పారిసికి, మిగతా సగం మానబె, హాసెల్‌మాన్‌లకు ఇవ్వనున్నట్లు అకాడమీ తెలిపింది.ఈ ఏడాది వీరు ఫిజిక్స్ నోబెల్ గెలిచిన పారిసి.. క్రమరహిత సంక్లిష్ట పదార్థాలలో దాగి ఉన్న నమూనాలను కనుగొన్నారు. సంక్లిష్ట వ్యవస్థల సిద్ధాంత రచనలకు అతని ఆవిష్కరణలు ఎంతగానో ఉపయోగపడ్డాయని రాయల్ స్వీడిష్ అకాడమీ తెలిపింది. ఇక వాతావరణం, పర్యావరణాన్ని కలిపే మోడల్‌ను సృష్టించిన క్లాజ్ హాసెల్‌మాన్‌ను కూడా ఈ ఏడాది ఫిజిక్స్ నోబెల్ వరించింది. మనుషుల కారణంగా ఉత్పన్నమవుతున్న కార్బన్‌డైఆక్సైడ్ వల్లే ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయని ఆయన పద్ధతులు నిరూపిస్తున్నాయి.వాతావరణంలో కార్బన్‌డైఆక్సైడ్ స్థాయిలు పెరిగిన కొద్దీ భూ ఉపరితల ఉష్ణోగ్రతలు ఎలా పెరుగుతున్నాయో నిరూపించిన స్యుకురో మనాబెను కూడా ఈసారి ఫిజిక్స్ నోబెల్‌కు ఎంపిక చేశారు. ప్రస్తుత పర్యావరణ మోడల్స్‌ను రూపొందించడానికి ఆయన రచనలు ఓ ఫౌండేషన్‌లా పని చేసినట్లు స్వీడిష్ రాయల్ అకాడమీ తెలిపింది.స్యుకురో మనాబె.. జపాన్‌లోని షింగు నగరంలో 1931లో జన్మించారు. యూనివర్సిటీ ఆఫ్ టోక్యో నుంచి 1957లో ఆయన పీహెచ్‌డీ పొందారు. అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో సీనియర్ మెటిరాలాజిస్ట్‌గా చేస్తున్నారు.క్లాస్ హాసెల్‌మాన్.. జర్మనీలోని హాంబర్గ్‌లో 1931లో పుట్టారు. జర్మనీలోని గొట్టిన్‌జెన్ వర్సిటీ నుంచి 1957లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. హాంబర్గ్‌లో ఉన్న మ్యాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటిరాలజీలో ప్రొఫెసర్‌గా చేస్తున్నారు.గియోర్గియో పారిసి.. ఇటలీ దేశంలోని రోమ్‌లో 1948లో జన్మించారు.

## రైతన్నల పై దమనకాండ సృష్టించిన మంత్రిని బర్తరఫ్ చేయాలి

### సీపీఐ నాయకులు బాబా ఫక్రుద్దీన్. కె ప్రసాద్ డిమాండ్

నంద్యాల అక్టోబర్ 5( విభారె) సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఉత్తరప్రదేశ్లోని లెక్కిం పూర్ కిరి జిల్లాలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతన్నపై ఉత్తర ప్రదేశ్ చీఫ్ మినిస్టర్ కాన్వాయ్ దూసుకుపోవడంతో అక్కడికక్కడే నలుగురు రైతులు మరణించడం.అదే ఘటనలో కాల్పుల్లో మరో నలుగురు మరణించడాన్ని నిరసిస్తూ మంగళవారం నాడు నంద్యాల పట్టణంలోని ఎన్టీఆర్ కాంప్లెక్స్ దగ్గర సిపిఐ ఆధ్వర్యంలో నిరసన తెలపడం జరిగింది. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ బాబా ఫక్రుద్దీన్ సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు రైతు సంఘం కార్యదర్శి జి సోమన్న ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి ఏ సురేష్ ఏఐఎస్ఎఫ్ నాయకులు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ బాబా ఫక్రుద్దీన్ సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ మాట్లాడుతూరైతులు గత 11 నెలలుగా మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని వివిధ రూపాలలో శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే కేంద్ర ప్రభుత్వం రైతుల ను చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించక పోగా ఇలా దమనకాండ సృష్టించడం వలన దేశానికి ఏ మెసేజ్ ఇస్తున్నారని అన్నారు. వెంటనే ఉత్తర ప్రదేశ్ లో రైతుల మరణాలకు కారణమైన యూపీ హోమ్ మినిస్టర్ ను పదవి నుండి బర్తరఫ్ చేయాలని ఆయన కొడుకు పై హత్య కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని అదే విధంగా మరణించిన ఒక్కొక్క రైతు కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏఐటియుసి నాయకులు అనంతయ్య. వెంకటేశ్వర్లు. అంజి. శివ శంకర్. వెంకటేశ్వర్ రెడ్డి. మల్లికార్జున. దస్తగిరి. సతీష్. రమణ. సుబ్బరాయుడు. గౌస్ నాగేష్. నాగరాజు. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# తేనెతుట్టెను ఎలా వదిలించుకోవాలి



మనింటి దగ్గర తేనెతుట్టెను చూసినప్పుడు, దాన్ని వెంటనే తీసేయాలని ప్రయత్నిస్తాం, ఎందుకంటే తేనెటీగలు మన చుట్టూ ఉండటం అపాయకరం. కాకపోతే మనం గుర్తుంచుకోవాల్సింది ఏంటంటే తేనెటీగలు వాతావరణంలో బ్యాలెన్స్ కి, మొక్కల పరాగ సంపర్కానికి, ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనవి. మనం రోజూ తినే కాయగూరలు, పళ్ళు తేనెటీగల కారణంగానే తయారవుతాయి. మీరు ఈ కింది చిట్కాలని ఉపయోగించి తేనెటీగలను చంపకుండా తేనెతుట్టెను తీసేయవచ్చు.తేనెతుట్టెను అలా వదిలేయకండి,ఎందుకంటే అలా వదిలేస్తే కొద్దిసేపట్లో మీ ఇంటి ముందు మొత్తం తేనెటీగల ఇల్లుగా మారిపోతుంది.అది మీ కుటుంబానికి, పెంపుడు జంతువులకే కాదు, పక్కింటి వాళ్ళకి కూడా చాలా హానికరం.ఇది వినటానికి చాలా భయంగా అన్పిస్తుంది. కానీ కొన్ని విషయాలను గమనిస్తూ, కొన్ని పద్ధతులు పాటిస్తే తేనెటీగలను చంపకుండా తేనెతుట్టెను సులభంగా తొలగించవచ్చు.ముందు తేనెతుట్టె ఎక్కడుందో సరిగ్గా వెతకండిముందు తేనెతుట్టె ఎక్కడుందో సరిగ్గా వెతకండిమీరు సులభంగానే మీ చుట్టుపక్కల తేనెతుట్టె ఎక్కడుందో కనిపెట్టవచ్చు. మీ ఇంట్లో ఒకటో లేదా రెండు తేనెటీగలు కన్పిస్తే,చుట్టుపక్కల ఎక్కడో దగ్గర్లోనే తేనెతుట్టె కూడా ఉంటుంది. ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా తేనెతుట్టెను తీసేయటం చాలా ముఖ్యం. కావాల్సిన పనిముట్లను అమర్చుకుని తేనెటీగలను వెతకండి,చంపొద్దు.తేనెటీగల సంరక్షకుడి సాయం తీసుకోండితేనెటీగల సంరక్షకుడి సాయం తీసుకోండిస్థానికంగా తేనెటీగలను పట్టుకొని వ్యాపారానికి వాడే సంరక్షకుల సాయం తీసుకోండి. ఈ సర్వీసు మీకు ప్రొఫెషనల్ పెస్ట్ కంట్రోల్ కంపెనీల ద్వారా దొరుకుతుంది. తేనెటీగల కీపర్ తేనెటీగలను చంపకుండా వాటిని తీసేసి పరాగ సంపర్కానికి, తేనెకోసం, మైనం కోసం వాడతారు. చాలామటుకు వివిధ కంపెనీలు తేనెతుట్టెలను ఉచితంగానే తొలగిస్తాయి, అందుకని మీకు తేనెతుట్టె కన్పిస్తే వెంటనే స్థానిక లిస్టింగ్స్ చెక్ చేయండి.తేనెటీగలకి పొగపెట్టండితేనెటీగలకి పొగపెట్టండితేనెతుట్టెల నుండి తేనెటీగలను బయటకి తొలగించటానికి మనం పొగ, అగరుబత్తిని వాడవచ్చు. వీటిని సాధారణంగా తేనెను కలెక్ట్ చేయాలనుకున్నప్పుడు తేనెతుట్టెలపై వాడతారు. పొగ,అగరుబత్తి వాడితే తేనెటీగలు నెమ్మదిగా తేనెతుట్టెను ఖాళీ చేస్తాయి. ఒకసారి తేనెతుట్టె ఖాళీ అయిందంటే, నెమ్మదిగా దాన్ని తొలగించవచ్చు. తేనెను పోగేసి, ఇంకా ఏమన్నా మిగిలితే కడిగేస్తే మళ్ళీ తేనెటీగలు ఆ ప్రదేశానికి ఆకర్షించబడవు.తేనెతుట్టె కింద రాత్రిపూట కాగితం లేదా కట్టెను కాల్చి పెట్టండితేనెతుట్టె కింద రాత్రిపూట కాగితం లేదా కట్టెను కాల్చి పెట్టండిమీరుండే చోట తేనెతుట్టె కన్పిస్తే,మీరు సాయంత్రం లేదా రాత్రిపూట దాని కింద కాగితం లేదా కట్టె ముక్కను కాల్చి పెడితే తేనెటీగలు పారిపోతాయి.తేనెటీగలు వాటి ఇంటికి చేరేసమయానికి పూర్తిగా డ్రస్ చేసుకుని వెళ్ళి కాల్చేసిరండి. తేనెటీగలకి దాక్కునే ప్రదేశాలు వదలకండి, లేకపోతే తప్పించేసుకుని మళ్ళీ వచ్చేస్తాయి.తేనెటీగలని ఆకర్షించే వస్తువులను తీసేయండితేనెటీగలని ఆకర్షించే వస్తువులను తీసేయండితేనెటీగలు నీళ్ళు లీకవుతున్న ట్యాంకులు, తెరచివున్న ఫౌంటేన్లకి ఎక్కువ ఆకర్షించబడతాయి. అందుకని తేనెటీగలు ఎక్కువ ఆకర్షించబడే ప్రదేశాలను, వస్తువులను తీసేయండి. తేనెటీగలను ఒక్కరోజు కూడా సౌకర్యవంతంగా ఉండేట్లు చూడద్దు లేకపోతే అవి ఎప్పటికీ అక్కడనుంచి కదలవు. తేనెతుట్టెను పూర్తిగా నాశనం చేసేయండి, అప్పుడే వాటికి ఆ ప్రదేశంలో ఉండటం కష్టమని అర్థమవుతుంది.తేనెతుట్టెను తీసేయడానికి మంచి సమయంతేనెతుట్టెను తీసేయడానికి మంచి సమయంమీరు బాగా పెరిగిన తేనెతుట్టెను నాశనం చేయటానికి మంచి సమయం వసంతకాలం ప్రారంభం లేదా చలికాలం చివరన. అదే తేనెతుట్టెను తీసేయటానికి మంచి సమయం ఎందుకంటే ఎక్కువ తేనెటీగలు ఉండవు. తేనెటీగలు పొద్దున్నే,సాయంకాలం తేనెతుట్టెలో విశ్రాంతి తీసుకుంటాయి. క్రిమిసంహారకాన్ని తుట్టెకి రాసి ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా తీసేయండి. మీకు అలర్జీ ఉంటే ఎవరైనా నిపుణుడిని పిలవండిమీకు అలర్జీ ఉంటే ఎవరైనా నిపుణుడిని పిలవండిమీకు అలర్జీ లేదని నిర్ధారించుకున్నాకే ఇందులో దిగండి ఎందుకంటే మీకు అలర్జీ ఉంటే తేనెటీగ కుడితే దాని విషం మీకు తీవ్ర ఆరోగ్య సమస్యలైన శ్వాస ఆడటం కష్టమవటం,వాంతులు మొదలైనవి రావచ్చు. ఇవి అలర్జీ ఉన్నవారికి ప్రాణాంతకం కావచ్చు. ఆ కేసులో తప్పకుండా నిపుణుడిని పిలవడం మంచిది.తేనెతుట్టెను వదిలించుకోటానికి సబ్బునీళ్ళుతేనెతుట్టెను వదిలించుకోటానికి సబ్బునీళ్ళుతేనెతుట్టె బయట భాగాన్ని ఎవరైనా సులభంగా సబ్బునీళ్లతో కరిగించవచ్చు. ఒక భాగం లిక్విడ్ డిష్ సోప్ ను నాలుగు భాగాల నీళ్ళతో స్ప్రే బాటిల్లో కలిపి తేనెతుట్టెపై స్ప్రే చేయండి. దీన్ని పాటిస్తే మనం తేనెతుట్టెను కొంతవరకు నాశనం చేయవచ్చు.సరిగ్గా తయారవండిసరిగ్గా తయారవండితేనెతుట్టెను తీయడానికి వెళ్లటానికి,మీరు సరిగ్గా తయారవటం ముఖ్యం. లేత రంగు బట్టలు, మెత్తగా ఉన్నవి వేసుకోండి లేకపోతే తేనెటీగలు వేగంగా మారిపోతాయి. మరీ పల్చని బట్టలు వేసుకోవద్దు లేకపోతే తేనెటీగలు కుడితే మచ్చలు పడిపోతాయి.మందపాటి గ్లోవ్స్,తలకి హెల్మెట్ లాంటిది పెట్టుకోండి,

# సినిమా పబ్లిసిటీలో మారుతి రూటే సెపరేటు..!



ఎంటర్టైన్మెంట్ చిత్రాల స్పెషలిస్ట్ దర్శకుడు మారుతి యూత్ తో పాటుగా ఫ్యామిలీ ఆడియన్స్ ని ఆకట్టుకున్నారు. 'ఈ రోజుల్లో' 'బస్ స్టాప్' 'ప్రేమ కథా చిత్రమ్' 'భలే భలే మగాడివోయ్' 'మహానుభావుడు' 'ప్రతిరోజూ పండగే' వంటి సినిమాలతో సూపర్ సక్సెస్ అందుకున్నారు. ప్రస్తుతం మ్యాచో స్టార్ గోపీచంద్ తో 'పక్కా కమర్షియల్'.. సంతోష్ శోభన్ తో 'మంచి రోజులు వచ్చాయి' సినిమాలు రూపొందిస్తున్నారు. అయితే మొదటి నుంచి కూడా సినిమాని పబ్లిసిటీ చేయడంతో మారుతి శైలి భిన్నమనే చెప్పాలి.మారుతి అప్పట్లో 5డీ కెమెరా తో తీసిన 'ఈరోజుల్లో' చిత్రాన్ని జనాల్లోకి తీసుకెళ్లడానికి వినూత్నమైన పద్ధతులు ఫాలో అయ్యారు. పోస్టర్స్ - టీజర్స్ అన్నీ యూత్ ని ఆకర్షించేలా సరికొత్తగా ప్లాన్ చేశారు. ఆ తర్వాత వచ్చిన చిత్రాలకు కూడా సినిమా కంటెంట్ ని బట్టి కొత్తగా పబ్లిసిటీ చేస్తూ వస్తున్నారు. కోర్టులో వాదిస్తున్నట్లు 'పక్కా కమర్షియల్' మూవీ అనౌన్స్ మెంట్.. సినిమా డిటైల్స్ ఏమీ లేకుండా రిలీజ్ డేట్ కోసం కుర్చీ మీద కర్చీఫ్ వేయడం వంటివి ఎంతగా వర్కవుట్ అయ్యాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇప్పుడు 'మంచి రోజులు వచ్చాయి' సినిమా ప్రమోషన్స్ విషయంలోనూ కొత్త స్ట్రాటజీ ఫాలో అవుతున్నారు.'ఏక్ మినీ కథ' ఫేమ్ సంతోష్ శోభన్ - 'ఎఫ్ 2' బ్యూటీ మెహ్రీన్ కౌర్ ఫిర్జాదా హీరోహీరోయిన్లుగా మారుతి తెరకెక్కిస్తున్న తాజా చిత్రం "మంచి రోజులు వచ్చాయి". వాస్తవ సంఘటన ఆధారంగా ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ రూపొందుతోంది. ఈ సినిమా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధంగా ఉంది. ఇప్పటి వరకు విడుదలైన ప్రచార చిత్రాలు - పాటలు మంచి స్పందన తెచ్చుకున్నాయి. ఇప్పుడు పరిస్థితులు సానుకూలంగా ఉండటంతో ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో "మంచి రోజులు వచ్చాయి" సినిమాలో కీలక పాత్ర పోషించిన అజయ్ ఘోష్ ఆడియో లీక్ అంటూ 'ఓ బిల'(మారుతి టీవీ) ద్వారా రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ ఇచ్చారు. అజయ్ ఘోష్ కు అప్పడాల విజయలక్ష్మి అనే మహిళ ఫోన్ చేయడం.. మారుతి డైరెక్ట్ చేసిన 'మంచి రోజులు వచ్చాయి' సినిమా నవంబర్ 4న విడుదల చేయబోతున్నారని తెలిసిందని.. తనను కూడా సినిమాకు తీసుకెళ్లాలంటూ డిమాండ్ చేయడం.. ఇలా ఇద్దరి మధ్య సంభాషణతో వచ్చిన ఆడియో వైరల్ అవుతోంది. డైరెక్టర్ మారుతి సినిమా ప్రమోషన్స్లో భాగంగా ఇలా ఆడియో లీక్డ్ అంటూ దీపావళి సందర్భంగా వచ్చే నెల 4న తమ సినిమా వస్తోందని వెల్లడించారు.కాగా 'మంచి రోజులు వచ్చాయి' చిత్రాన్ని యూవీ కాన్సెప్ట్స్ మరియు మాస్ మూవీ మేకర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. వి సెల్యులాయిడ్ మరియు ఎస్కెఎన్ దీనికి నిర్మాతలు. అనూప్ రూబెన్స్ ఈ చిత్రానికి సంగీతం సమకూర్చారు. సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫీ అందించగా.. రామ్ కుమార్ ఆర్ట్ డైరెక్టర్ గా వర్క్ చేశారు. ఇందులో అజయ్ ఘోష్ - వెన్నెల కిషోర్ - శ్రీనివాస్ రెడ్డి - ప్రవీణ్ - సప్తగిరి - సుదర్శన్ - వైవా హర్ష - సత్యం రాజేష్ - శ్రీకాంత్ అయ్యంగార్ తదితరులు పాత్రలు పోషించారు. మారుతి గత చిత్రాల తరహాలోనే ఈ సినిమా ఉండబోతోంది. డిఫరెంట్ ప్రమోషనల్ స్ట్రాటజీ తో సినిమాని జనాల్లోకి తీసుకెళ్తున్న సక్సెస్ ఫుల్ డైరెక్టర్ కు 'మంచి రోజులు వచ్చాయి' మంచి విజయాన్ని అందిస్తుందేమో చూడాలి.

# పవన్ మూవీ అప్డేట్ ఇచ్చిన క్రిష్

వైష్ణవ్ తేజ్ హీరోగా నటించిన కొండపొలం సినిమా విడుదలకు సిద్ధం అయ్యింది. కరోనా టైమ్ లో ప్రారంభం అయ్యి పూర్తి అయిన సినిమా కొండపొలం. దర్శకుడు క్రిష్ అతి తక్కువ సమయంలోనే సినిమాను ముగించాడు. గత ఏడాదిలోనే ఈ సినిమాను పూర్తి చేశారనే వార్తలు వచ్చాయి. కాని కొన్ని కారణాల వల్ల సినిమా విడుదల వాయిదా వేస్తూ వచ్చారు. ఆమధ్య ఓటీటీ రిలీజ్ గురించి కూడా ప్రచారం జరిగింది.




కాని దర్శకుడు క్రిష్ థియేటర్ రిలీజ్ కు మొగ్గు చూపడంతో సినిమా ఈనెల 8న దసరా కానుకగా థియేటర్ల ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు గాను సిద్దం అయ్యింది. కొండపొలం ప్రారంభించకుండానే పవన్ తో హరి హర వీరమల్లు సినిమాకు కమిట్ చేయించిన క్రిష్ గ్యాప్ ఉండటంతో ఈ సినిమాను పట్టాలెక్కించి రెండు నెలల్లోనే పూర్తి చేశాడు. క్రిష్ కొండపొలం సినిమా ప్రమోషన్ ఇంటర్వ్యూలో భాగంగా హరి హర వీరమల్లు సినిమా కు సంబంధించిన కీలక అప్డేట్ ను ఇచ్చి ఫ్యాన్స్ కు తీపి కబురు అందించాడు.తాజాగా ఒక ఇంటర్వ్యూలో క్రిష్ మాట్లాడుతూ.. హరి హర వీరమల్లు సినిమా చిత్రీకరణ ప్రారంభించి ఇప్పటికే కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. మార్చి వరకు సినిమా కు సంబంధించిన కీలక సన్నివేశాలను ముగించాం. ఇప్పటికే షూటింగ్ ను 50 శాతం వరకు ముగించినట్లుగా దర్శకుడు క్రిష్ ప్రకటించాడు. ప్రస్తుతం పవన్ గారు ఇతర ప్రాజెక్ట్ లతో బిజీగా ఉన్నారు. నవంబర్ లో మళ్లీ హరి హర వీరమల్లు సినిమా చిత్రీకరణ పునః ప్రారంభిస్తాం. జనవరి వరకు సినిమా షూటింగ్ ను ముగిస్తామని క్రిష్ చెప్పాడు. ఈ సినిమా కు సంబంధించిన వీఎఫ్ఎక్స్ వర్క్ ఎక్కువగా ఉంటుందని.. అందుకే షూటింగ్ ముగిసిన తర్వాత కాస్త ఎక్కువ సమయం తీసుకుంటున్నట్లుగా పేర్కొన్నాడు. ఇప్పటికే హరి హర వీరమల్లు మూవీ కొత్త విడుదల తేదీని అధికారికంగా ప్రకటించడం జరిగింది.ఇంతకు ముందు 2022 సంక్రాంతికి అంటూ ప్రకటించారు. కాని సెకండ్ వేవ్ కారణంగా షూటింగ్ ఆలస్యం అయ్యింది. అందుకే విడుదల తేదీని వచ్చే ఏడాది ఏప్రిల్ కు వాయిదా వేసినట్లుగా ప్రకటించారు. 2022 ఏప్రిల్ 29న విడుదల చేసేందుకు గాను ఏర్పాట్లు చేస్తున్నట్లుగా క్రిష్ ప్రకటించాడు. సినిమాను నవంబర్ నుండి పునః ప్రారంభించి స్పీడ్ గా ముగించేందుకు గాను ఇప్పటి నుండే ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నట్లుగా చిత్ర దర్శకుడు క్రిష్ చెప్పుకొచ్చాడు. ఇక హరి హర వీరమల్లు సినిమాకు గాను టైమ్ ఉన్న నేపథ్యంలో కొండ పొలం సినిమాను చేసేందుకు పవన్ ను అనుమతి అడిగిన తర్వాత మొదలు పెట్టాను అన్నాడు. కొండ పొలం సినిమా పవన్ కు కూడా చాలా బాగా నచ్చిందని క్రిష్ ఒకానొక సందర్బంలో చెప్పుకొచ్చాడు. ఉప్పెన వంటి భారీ సినిమా తర్వాత వైష్ణవ్ తేజ్ నుండి వస్తున్న సినిమా అవ్వడంతో అంచనాలు భారీగా ఉన్నాయి.

## కోహ్లి సేనకు అంత సీన్ లేదు.. మాకు అసలు పోటీనే కాదు: పాక్ మాజీ ప్లేయర్




టీ20 ప్రపంచకప్-2021లో భారత్-పాక్‌ల మధ్య పోరు నేపథ్యంలో పాక్ మాజీ ఆల్‌రౌండర్ అబ్దుల్ రజాక్ టీమిండియాను మానసికంగా దెబ్బతీసే ప్రయత్నం చేశాడు. టీమిండియా అసలు తమకు పోటీనే కాదని.. కోహ్లి సేనకు అంత సీన్ లేదంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశాడు. పాక్ క్రికెటర్ల టాలెంట్ చాలా భిన్నమైందని.. అది టీమిండియా ఆటగాళ్ల దగ్గర మచ్చుకైనా లేదని అన్నాడు. భారత్‌తో పోలిస్తే పాకిస్థాన్ మెరుగైన ఆటగాళ్లను అందించిందని.. కపిల్ దేవ్ ?కంటే ఇమ్రాన్ ఖాన్ గొప్ప ఆల్‌రౌండర్ అని, వసీం అక్రమ్ లాంటి ప్లేయర్ భారత్‌లో పుట్టలేదని గొప్పలు పోయాడు. ఈ సందర్భంగా ఆయన భారత్-పాక్‌ల ద్వైపాక్షిక సిరీస్‌పై స్పందించాడు. ప్రస్తుత తరుణంలో భారత్-పాక్‌ల మధ్య సిరీస్ లేకపోవడం లోటుగా ఉందని, అది క్రికెట్‌కు ఏమాత్రం మంచిది కాదని అభిప్రాయపడ్డాడు. ఇరు జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరుగుతూ ఉంటే ఎవరి టాలెంట్ ఎంతో ప్రపంచానికి కూడా తెలిసేదని అన్నాడు. టీమిండియా ఆటగాళ్లతో పోలిస్తే పాక్ ప్లేయర్స్ ఒత్తిడిని ఎక్కువగా తట్టుకోగలరని, అది ఇటీవల జరిగిన మ్యాచ్‌ల ద్వారా నిరూపితమైందని పేర్కొన్నాడు. ఇదిలా ఉంటే, ప్రపంచకప్‌లో ఇప్పటివరకు జరిగిన దాయాదుల పోరులో పాక్ ఒక్క మ్యాచ్ కూడా గెలవకపోవడం విశేషం. త్వరలో ప్రారంభంకాబోయే టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఈ నెల 24న భారత్-పాక్‌ల మధ్య రసవత్తర పోరు జరగనున్న సంగతి తెలిసిందే.


# మహేష్ బాబు లక్ష్మి నరసింహ స్వామి..!




సూపర్ స్టార్ మహేష్ బాబు సర్కారు వారి పాట చిత్రీకరణ చకచక జరుగుతోంది. స్పెయిన్ లో సినిమా షూటింగ్ కోసం యూనిట్ సభ్యులు అంతా కూడా అక్కడకు వెళ్లారు. మహేష్ బాబు కుటుంబ సభ్యులతో సహా అక్కడకు వెళ్లడం జరిగింది. షూటింగ్ ప్రారంభించిన కొన్ని రోజులకు నమ్రత మరియు పిల్లలు కలిసి స్పెయిన్ వెళ్లారు అంటూ సమాచారం అందుతోంది. మహేష్ బాబు మరియు కీర్తి సురేష్ లు జంటగా నటిస్తున్న సర్కారు వారి పాట చిత్రం షూటింగ్ ను ఈ నెల చివర్లో లేదా వచ్చే నెల ఆరంభంకు పూర్తి చేయాలనే పట్టుదలతో ఉన్నారు. అందుకోసం తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. పెద్ద ఎత్తున అంచనాలున్న సర్కారు వారి సినిమా లోని కీలకమైన ఇంటర్వెల్ సన్నివేశాలను చిత్రీకరించారు. ఇంటర్వెల్ కు ముందు సన్నివేశంలో విలన్ కు హీరో మహేష్ బాబు లక్ష్మి నరసింహ స్వామి గా కనిపిస్తాడట. యాక్షన్ సన్నివేశంలో భాగంగా మహేష్ బాబు కొన్ని నిమిషాలు ఆ గెటప్ లో కూడా కనిపించబోతున్నట్లుగా విశ్వసనీయ సమాచారం అందుతోంది.మహేష్ బాబు ప్రతి సినిమాలో కూడా రెగ్యులర్ లుక్ లో కనిపించబోతున్నాడు. ఎప్పుడు కూడా మహేష్ బాబు చాలా కూల్ లుక్ లో కనిపిస్తూ ఉంటాడు. సర్కారు వారి పాట కోసం కాస్త గెటప్ మార్చాడు. ఆ గెటప్ కు సంబంధించిన లుక్ ఇప్పటికే రివీల్ అయ్యింది. అంతకు మించి అన్నట్లుగా లక్ష్మి నరసింహ స్వామి గెటప్ లో కనిపించబోతున్నట్లుగా వస్తునన్ వార్తలు సినిమా పై అంచనాలను ఆకాశానికి లేపుతున్నాయి. ఇప్పటి వరకు స్టార్ హీరోల్లో కొద్ది మంది మాత్రం అలాంటి గెటప్స్ లో కనిపించారు. మహేష్ బాబును కొన్ని నిమిషాల పాటు ఆ గెటప్ లో చూడబోతున్న ఫ్యాన్స్ అభిప్రాయం ఏంటీ అనేది ఆసక్తిగా ఉంది. కొన్ని సార్లు ఇలాంటి జిమ్మిక్కులు సూపర్ సక్సెస్ అయ్యే అవకాశం ఉంటుంది. కొన్ని సార్లు మాత్రం నిరాశ పర్చే అవకాశం కూడా ఉంటుంది.సర్కారు వారి పాట సినిమాలో మహేష్ బాబు కనిపించబోతున్న లుక్ విషయాన్ని పక్కన పెడితే ఖచ్చితంగా ఈ సినిమా ఒక మంచి ఎంటర్ టైనర్ గా నిలుస్తుందనే నమ్మకంను అభిమానులు వ్యక్తం చేస్తున్నారు. కీర్తి సురేష్ లుక్ మరియు మహేష్ బాబు టైమింగ్ కు తోడు దర్శకుడు పరశురామ్ ఒక మంచి ఫన్ ను క్రియేట్ చేస్తాడని నమ్మకంను అంతా వ్యక్తం చేస్తున్నారు. యాక్షన్ సన్నివేశాలు మాత్రమే కాకుండా ఫ్యామిలీ ఆడియన్స్ మెచ్చే సన్నివేశాలు ఇంకా పాటలు అన్ని కలిపి ఫుల్ మీల్స్ గా సర్కారు వారి పాట ఉంటుందని ప్రతి ఒక్కరు నమ్ముతున్నారు. సంక్రాంతికి ఈ సినిమాను బాక్సాఫీస్ వద్దకు తీసుకు వచ్చేందుకు సిద్దం అవుతున్నారు. రికార్డు బ్రేకింగ్ వసూళ్లను ఈ సినిమా అందుకుంటుందా అనేది చూడాలి. సంక్రాంతికి వారం ముందు ఆర్ ఆర్ ఆర్ ను విడుదల చేస్తున్నారు. కనుక సర్కారు వారి పాట విడుదల విషయంలో ఏమైనా మార్పు ఉంటుందా అనేది చూడాలి. ఇప్పటి వరకు అయితే సర్కారు వారి పాట చిత్రం సంక్రాంతి బరిలోనే ఉంది.

# టీమిండియా క్యాప్ పెట్టుకున్నారు.. ఇంకెందుకు ఆడుతారు

ముంబై ఇండియన్స్ తరపున ఆడుతున్న సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్‌లు ఐపీఎల్ 2021 సీజన్ సెకండ్‌ఫేజ్‌లో చెత్త ప్రదర్శన కనబరుస్తున్నారు. గత ఐదు ఇన్నింగ్స్‌లో సూర్యకుమార్ వరుసగా 3,5,8,0,33 పరుగులు చేసి నిరాశపరిచాడు. మరో పక్క ఇషాన్ కిషన్ ప్రదర్శన కూడా దారుణంగా ఉంది. తన చివరి మూడు ఇన్నింగ్స్‌ల్లో 11,14, 9 పరుగులు చేశాడు. కాగా టి20 ప్రపంచకప్‌కు టీమిండియాలో ఈ ఇద్దరు చోటు దక్కించుకున్నారు. కాగా వీరు ఫామ్‌లో లేకపోవడం సెలక్టర్లకు ఆందోళన కలిగిస్తుంది. అక్టోబర్ 10 వరకు సమయం ఉండడంతో టీమిండియా జట్టులో మార్పులు చేసే అవకాశం ఉందంటూ వార్తలు కూడా వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే టీమిండియా మాజీ క్రికెటర్.. దిగ్గజ ఆటగాడు సునీల్ గావస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు."టీమిండియా జట్టులోకి ఎంపికైన తర్వాత ఇషాన్ కిషన్, సూర్యకుమార్‌లు ఎందుకో రిలాక్స్ మోడ్‌లో ఉన్నట్లు



అనిపిస్తుంది. వారి ఆటతీరులో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. ఐపీఎల్‌లో ఏదో మొక్కుబడికి ఆడినట్లుగా వారి షాట్ సెలక్షన్‌లో కనిపిస్తుంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**